ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com సంపుటి : 01 సంచిక : 119 గురువారం 16 - 04 - 2026 ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్ పేజీలు : 08 వెల : 6/-

Published From : Rangareddy e - paper.vaarthasandhya.com VOLUME : 01 Issue : 119 Thursday 16 - 04 - 2026 Editor : Seggem Kiran Kumar Pages : 08 Price : 6/-

## మహిళా రిజర్వేషన్ బిల్లుకు
# సంపూర్ణ మద్దతు

- మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్
- మహిళా రిజర్వేషన్ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై కేసీఆర్ నిర్ణయం ఇదీ
- డీలిమిటేషన్ బిల్లును పరిశీలించాకే నిర్ణయం ఉంటుందని వెల్లడి
- దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడబోమని వెల్లడి
- చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు



**వార్త సంధ్య, హైదరాబాద్, ఏప్రిల్ 15 :** భారత ప్రభుత్వం నేడు పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించారు. ఎర్రవెల్లిలోని తన నివాసంలో పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్, హరీశ్ రావులతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా దేశ, రాష్ట్ర - మిగతా 2 లో

## దక్షిణాదికి అన్యాయం జరిగితే
# తీవ్ర పోరాటం తప్పదు



2 లో

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక
- నేడు పార్లమెంట్ లో డీలిమిటేషన్ బిల్లు
- దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందని సర్వత్ర ఆందోళన
- దక్షిణాదికి అన్యాయం జరిగితే దేశ వ్యాప్తంగా ప్రజా ఉద్యమానికి దారి తీస్తుందన్న కేటీఆర్
- దక్షిణాది ప్రజల విషయంలో బుద్ధిగా వ్యవహరించాలని కేంద్రానికి హితవు




2 లో

## బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత
- వికారాబాద్‌లో కల్వకుంట్ల కవిత గర్జన
- పరిగి ప్రాంత రైతుల నుంచి సాగు భూములను లాక్కుంటున్నారంటూ కవిత ధర్నా
- అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని వ్యాఖ్య
- రైతుల సమ్మతి లేకుండా ఒక్క ఎకరా భూమి కూడా తీసుకోవడానికి వీల్లేదన్న కవిత

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు

- ఐదుగురి మృతి... 12 మంది పరిస్థితి విషమం
- సత్యసాయి జిల్లా కదిరిలో భారీ పేలుడు
- డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఘటన
- ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి
- 20 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశం



2 లో

## ఏపీ ఇంటర్ ఫలితాల విడుదల 12 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఉత్తీర్ణత!




2 లో

- ఇంటర్ ఫలితాలను విడుదల చేసిన విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్
- పరీక్షలకు హాజరైన మొత్తం 10.50 లక్షల మంది విద్యార్థులు
- ఫస్టియర్లో 77 శాతం.. సెకండియర్లో 81 శాతం మంది విద్యార్థుల పాస్

## 24ఏళ్లలో మోదీపై ఒక్క అవినీతి మచ్చ లేదు



- కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- టీఎంసీ దోచుకున్న ప్రతి పైసా తిరిగి వసూలు చేస్తాం
- బెంగాల్‌లో ఎన్నికల ర్యాలీలో అమిత్ షా- టీఎంసీ సర్కార్‌పై విమర్శలు

## భారత్‌లో తొలిసారి ముంబైలో పట్టాలెక్కనున్న నాన్ - ఏసీ క్లోజ్డ్ డోర్ లోకల్ రైలు

- ప్రమాదాల నివారణ, వేడి నుంచి ఉపశమనం కల్పించడం ప్రధాన లక్ష్యం
- ఏసీ లేకున్నా 'ఫోర్స్ వెంటిలేషన్' సిస్టమ్‌తో కోచ్‌లలో చల్లదనం
- చెన్నై ఐసీఎఫ్‌లో తయారీ.. త్వరలో ముంబై ట్రాక్‌లపై ట్రయల్స్
- సాధారణ ఛార్జీలకే ఏసీ రైలు తరహా భద్రతా ఫీచర్లు

**వార్త సంధ్య, ముంబై, ఏప్రిల్ 15 :** దేశ ఆర్థిక రాజధాని ముంబై లోకల్ రైళ్లలో ప్రయాణించే లక్షలాది మందికి భారతీయ రైల్వే శుభవార్త అందించింది. దేశంలోనే మొట్టమొదటిసారిగా నాన్-ఏసీ, ఆటోమేటిక్ డోర్లు మూసుకునే సదుపాయం - మిగతా 2 లో



2 లో

## ఏపీలో 38 లోక్‌సభ 263 అసెంబ్లీ స్థానాలు




- డీలిమిటేషన్‌తో మారనున్న సమీకరణాలు
- నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లపై కేంద్రం దృష్టి
- నేటి నుంచి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కీలక బిల్లులు
- ఏపీలో 175 నుంచి 263కు పెరగనున్న అసెంబ్లీ స్థానాలు
- 25 నుంచి 38కి చేరనున్న లోక్‌సభ సీట్లు
- 2029 ఎన్నికల నాటికి కొత్త విధానం అమలు లక్ష్యం

**వార్త సంధ్య, అమరావతి, ఏప్రిల్ 15 :** దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్ బిల్లులను ఏప్రిల్ 16 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లులు ఆమోదం పొందితే 2029 సాధారణ ఎన్నికల నాటికి ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రం సమూలంగా మారనుంది. ప్రస్తుత ప్రతిపాదనల ప్రకారం, ఏపీలో - మిగతా 2 లో

## నీటి భద్రత కోసం
# 'జలధార'

- 'జలధార' యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాలు
- ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష
- పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచన
- జూన్ చివరి నాటికి వెలిగొండ మొదటి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- నేరడి బ్యారేజ్, చింతలపూడి కెనాల్‌కు త్వరలో టెండర్లు
- రాష్ట్రంలో పెరిగిన భూగర్భ జలాలు.. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పునరుద్ధరణకు చర్యలు



**వార్త సంధ్య, అమరావతి, ఏప్రిల్ 15 :** రాష్ట్రంలో నీటి భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరి జలాలను ఎలా వినియోగించుకోవాలో స్పష్టమైన 'జలధార యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుడి, ఎడమ కాలువలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులను నింపేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో జలవనరుల శాఖపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా సహా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, హోటళ్లు, షాపింగ్ ఏరియాలతో పాటు పోలవరం-పాపికొండలు-భద్రాచలం మార్గంలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని సీఎం సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టులో కీలకమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. పునరావాస పనులను వేగవంతం చేసి, నిర్వాసితుల తరలింపును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు రూ. 27,089 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన పనులకు మరో రూ. 5,108 కోట్లు అవసరమని అధికారులు వివరించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు స్టేజ్-1 పనులను జూన్ నెలాఖరు నాటికి పూర్తి - మిగతా 2 లో

# సంపాదకీయం

## మళ్లీ యుద్ధ మేఘాలు!



చరిత్రాత్మకం అన్నారు. ఉన్నతస్థాయి చర్చలన్నారు. దౌత్యం పూర్తి స్థాయిలో పనిచేస్తోందన్నారు. శాంతికి పశ్చిమాసియా చేరువలో ఉందన్నారు. పాకిస్తాన్ రాజధాని ఇస్లామా బాద్‌లో 21 గంటలపాటు కొనసాగిన అమెరికాఇరాన్ ప్రతినిధి బృందాల చర్చలపై ఎప్పటికప్పుడు మీడియాలో వచ్చిన సమాచారం సారాంశమిది. తీరా బయటికొచ్చిన అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చర్చలు విఫలమయ్యాయని ప్రకటించి నిష్క్రమించారు. ఆ వెంటనే ఆ దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బెదిరింపు భాష మొదలైంది. అమెరికా ఏకపక్ష వైఖరివల్ల 47 సంవత్సరాల తర్వాత ఆ రెండు దేశాలమధ్యా నేరుగా సాగిన చర్చలు చివరికిలా నీరుగారాయి. వచ్చేవారం మరోసారి చర్చలుంటాయని చెబుతున్నారు. కానీ అమెరికా వైఖరి మారకపోతే ప్రయోజనం శూన్యం. ట్రంప్ వచ్చాక చర్చల అర్థమే మారిపోయింది. చర్చలంటే ఆయన శాసిస్తే ఎదుటిపక్షం శిరోధార్యంగా స్వీకరించటం తప్ప మరేంకాదు. అసలు ఈ యుద్ధంపై తీవ్ర అసంతృప్తితో ఉన్న వాన్స్ నాయకత్వాన ప్రతినిధి బృందాన్ని పంపటంలోనే ఆయన నిజాయితీలేమి వెల్లడైంది. ఏ అధికారమూ లేని, సొంతంగా ఎలాంటి చొరవా తీసుకోలేని ఆ అశక్త బృందం చివరకు ఉత్త డొల్లగా మిగిలిపోయింది.ట్రంప్ తీరు 90వ దశకం మొదట్లో సోవియెట్ యూనియన్ కుప్పకూలిననాటి పరి స్థితుల్ని తలపిస్తోంది. అంతవరకూ సోవియెట్ భాగస్వామ్య రాష్ట్రాలుగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కడికక్కడ సమావేశాలు జరగటం, దేశంనుంచి విడిపోతున్నట్టు ప్రకటించటం రివాజై పోయింది. నిజంగా అలా ప్రకటించేవారి బలాబలాలేమిటో, ఆ తీర్మానాలు అమలయ్యే అవకాశం ఉందో లేదో తెలియని స్థితి. ఇలాంటి అనిశ్చితే ఇప్పుడు అమె రికాను ఆవరించింది. నరమేధాన్ని సాగిస్తూ ఘనవిజయాలుగా ప్రకటించుకోవటం, ఇరాన్ నాగరికత ఈ రాత్రితో అంతం కాబోతున్నదని ప్రకటించటం, అంతలోనే చర్చలకు రావాలంటూ బెదిరించటం ట్రంప్ అలవాటు చేసుకున్నారు. ఇజ్రాయెల్‌తోపాటు ఈ యుద్ధానికి లోపాయికారీగా మద్దతిచ్చిన దేశాలన్నీ ఇరాన్‌నుంచి శరపరంపరగా వచ్చి పడుతున్న క్షిపణుల ధాటికి బెంబేలెత్తినా, అక్కడ పెనువిధ్వంసం చోటుచేసుకుంటున్నా ట్రంప్ బడాయి మాటలు ఆగలేదు. ఆయన ప్రకటనలకు భిన్నమైన స్థితిగతులున్నాయని సైనికా ధికారులే మీడియాకు రహస్యంగా చెప్పటం అమెరికాలో కుప్పకూలుతున్న వ్యవస్థలకు ఆనవాలు. సోవియెట్ కనుమరుగయ్యే ముందు కూడా ఇలాంటి ధోరణులే కనబడ్డాయి.ఇతర దేశాల సహకారంతో హార్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని ట్రంప్ చెప్పిన కొన్ని గంటలకే, అందుకు తాము అంగీకరించబోమని నాటో భాగస్వామ్య దేశాలు బ్రిటన్, ఫ్రాన్స్‌లు ప్రకటించి గాలి తీశాయి. 'హార్మూజ్ దిగ్బంధం' అంటూ చేసిన ప్రకటనకు అర్థం ఇరాన్ నౌకాశ్రయాల దిగ్బంధమని అమెరికా సైన్యం ఆ వెంటనే తెలిపింది. సోమవారం నుంచి అమల్లోకి వచ్చిందని కూడా ప్రకటించారు. కానీ గల్ఫ్ దేశాలే దీన్ని నిరసిస్తున్నాయి. ట్రంప్ చర్య ఈ ప్రాంతం మొత్తాన్ని శాశ్వతంగా యుద్ధ ఊబిలోకి దించేస్తుందని సౌదీ అరేబియాతోసహా చాలా దేశాలు ఆందోళనపడుతున్నాయి. సౌదీ చమురు ఎగుమతులు యుద్ధానికి ముందు మాదిరే రోజుకు 70 లక్షల బ్యారెళ్లకు చేరు కున్నాయి. అవి ఎర్ర సముద్రం గుండా వెళ్తున్నాయి. కానీ అమెరికా దుందుడుకు చర్యకు దిగితే యెమెన్‌లోని హౌతీలు ఆ ఎగుమతుల్ని దెబ్బతీస్తారు. తన నాయకత్వాన ఇన్ని దశాబ్దాలుగా సాగిన ఏకధ్రువ ప్రపంచం కళ్లముందు కుప్పకూలుతున్న వైనాన్ని అమెరికా గ్రహించకపోతే పోయిందిగానీ... చైనా నాయకత్వంలో కొత్త అమరిక మొగ్గతొడుగుతోందన్న సంగతైనా అది తెలుసుకోవాలి. ఈ యుద్ధం తనకూ, ఇరాన్‌కూ మధ్య పంచాయతీ కాదు. అది పశ్చిమాసియాకు పరిమిత మైంది అంతకన్నా కాదు. ప్రపంచంలో తన ఆధిపత్యాన్ని క్రమేపీ బలహీనపరుస్తున్న ఒక నిరర్థక యుద్ధం. అది చైనా నాయకత్వాన కొత్త కూటమికి పురుడు పోస్తున్న ప్రమాదకర యుద్ధం. ఆర్థికంగా, సైనికంగా ప్రపంచంలోనే తాము సర్వశక్తిమంతులమని ఇరాన్‌తో చర్చలకు చాన్నాళ్లముందు జేడీ వాన్స్ అన్నారు. ట్రంప్ ప్రభావం ఆయనపై ఎక్కువే ఉన్నట్టుంది. ఆ దృశ్యం మారుతున్న సంగతిని అమెరికా నాయకత్వం ఎంత త్వరగా గ్రహిస్తే అంత మంచిది.

## నీటి భద్రత కోసం 'జలధార'

**మొదటిపేజీ తరువాయి** - చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. హంద్రీనీవా ద్వారా ఇప్పటివరకు 52 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని, వంశధార నదిపై ప్రతిష్ఠాత్మకమైన నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగినందున వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపుడిశెల ప్రాజెక్టు పనులనూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. పోలవరం-నల్లమల సాగర్ అనుసంధానానికి సంబంధించిన డీపీఆర్‌కు త్వరగా ఆమోదం పొందేలా చూడాలని సూచించారు.రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ చర్యల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది 0.79 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు.గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరించేందుకు త్వరగా టెండర్లు పిలవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఏపీలో 38 లోక్‌సభ, 263 అసెంబ్లీ స్థానాలు

**మొదటిపేజీ తరువాయి** - అసెంబ్లీ స్థానాల సంఖ్య 175 నుంచి 263కు, లోక్‌సభ స్థానాల సంఖ్య 25 నుంచి 38కి పెరిగే అవకాశం ఉంది. 2023లో ఆమోదం పొందిన 'నారీ శక్తి వందన్ అధినియం' (మహిళా రిజర్వేషన్ చట్టం)ను 2029 ఎన్నికల నాటికి అమలు చేయడమే లక్ష్యంగా కేంద్రం ఈ సంస్కరణలను చేపట్టింది. ఈ బిల్లులు పార్లమెంటులో ఆమోదం పొందిన వెంటనే, నియోజకవర్గాల సరిహద్దులను నిర్ణయించేందుకు కేంద్ర ప్రభుత్వం ఒక డీలిమిటేషన్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తుంది.ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, ఏపీలో 33 శాతం మహిళా రిజర్వేషన్ల ప్రకారం పెరిగిన అసెంబ్లీ స్థానాల్లో దాదాపు 87, లోక్‌సభ స్థానాల్లో 13 మహిళలకు కేటాయించబడతాయి. సీట్ల పెంపునకు అనుగుణంగా జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు స్థానాల సంఖ్య కూడా పెరగనుంది.

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు



**మొదటిపేజీ తరువాయి** - శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కదిరి మండలంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఐదుగురు మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది.వివరాల్లోకి వెళితే, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ కూలీ ఇంట్లో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు మొదట పేలాయి. ఈ పేలుడు ధాటికి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించి, ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా డిటోనేటర్లు ఎందుకు నిల్వ ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# 24ఏళ్లలో మోదీపై ఒక్క అవినీతి మచ్చ లేదు

**మొదటిపేజీ తరువాయి** - బంగాల్‌లో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తృణమూల్ కాంగ్రెస్ దోచుకున్న ప్రతి పైసాను వడ్డీతో సహా తిరిగి వసూలు చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా హామీ ఇచ్చారు. 24 ఏళ్లుగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారంలో ఉన్నప్పటికీ, ఆయనపై ఒక్క అవినీతి ఆరోపణ కూడా లేదని ఆయన పేర్కొన్నారు. బుధవారం ఉత్తర బంగాల్‌లోని జల్పాయ్‌గుడి జిల్లా రాజ్‌గంజ్‌లోని ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. "ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అధికారం నుంచి వైదొలగడం ఖాయం. ఆ ప్రక్రియను ప్రారంభించే బాధ్యత ఇక్కడ నుంచే ప్రారంభమవుతుంది. ప్రధాని మోదీ గుజరాత్‌లో 12 ఏళ్లు పాలించారు. కేంద్రంలో మరో 12 ఏళ్లుగా నాయకత్వం వహిస్తున్నారు. అయినా సరే ఒక్క రూపాయి అవినీతి ఆరోపణ కూడా ఎదుర్కోలేదు. బంగాల్‌లో బీజేపీని అధికారంలోకి తీసుకురండి. టీఎంసీ నాయకులు ప్రజల నుంచి దొంగలించిన ప్రతి పైసాను, వడ్డీతో సహా మేం తిరిగి రాబడతాం" అని అమిత్ షా తెలిపారు.బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీచర్ల నియామక స్కాంలో రూ.300 కోట్లు, ఉత్తర బంగాల్ వరద సహాయ నిధుల్లో రూ.100 కోట్లు దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అమిత్ షా హెచ్చరించారు. ఉత్తర బంగాల్ మూడు 'టీ'లతో (టీ, టింబర్, టూరిజం) ప్రసిద్ధి చెందిందని, కానీ సీఎం మమతా నాలుగో టీగా బీజేపీ కార్యకర్తల కన్నీళ్లను జోడించారని



విమర్శించారు. ఉత్తర బంగాల్ అభివృద్ధికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. టీ తోట కార్మికులకు భూ హక్కులు కల్పించి వారిని భూస్వాములుగా మారుస్తామని వెల్లడించారు. టీఎంసీ గూండాలను గుర్తించి చట్టం ముందు నిలబెట్టడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం (ఈవీఎం)లో కమలం గుర్తుపై ఓటు వేసి బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు.ప్రజలు బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలని, అప్పుడు బంగాల్ అంతటా ఎవరూ నాలుగు వివాహాలు చేసుకోలేరని అమిత్ షా తెలిపారు. తాము లవ్, ల్యాండ్ జిహాద్‌కు ముగింపు పలుకుతామని అన్నారు. అలాగే మహిళలకు ప్రతి నెలా రూ. 3 వేలు, నిరుద్యోగ యువతకు రూ. 3000 ఇస్తామమని చెప్పారు. తల్లులు, సోదరీమణులు ప్రభుత్వ బస్సుల్లో టికెట్లు కొనాల్సిన అవసరం ఉండదు, వారు ఉచితంగా ప్రయాణించగలుగుతారుని అన్నారు.అధికారంలోకి వచ్చిన వెంటనే డార్జిలింగ్‌లోని గూర్ఖాలాండ్ సమస్య పరిష్కారానికి రాజ్యాంగబద్ధంగా శాశ్వత పరిష్కారం చూపుతామని అమిత్ షా తెలిపారు. గతంలో జరిగిన హింసాత్మక ఆందోళనల నేపథ్యంలో గుర్ఖా సోదరులపై వేల సంఖ్యలో తప్పుడు కేసులు నమోదు చేశారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని ఉపసంహరిస్తామని స్పష్టం చేశారు. గుర్ఖా సమస్య పరిష్కారం కోసం గతంలో దిల్లీలో నిర్వహించిన మూడు సమావేశాలకు మమతా హాజరు కాలేదని ఆరోపించారు. మధ్యవర్తిని నియమించినప్పటికీ ఆమె సహకరించలేదని విమర్శించారు. రాష్ట్రంలో చొరబాట్లు, గూండా రాజ్యం, మాఫియా వ్యవస్థకు ముగింపు పలుకుతామని పేర్కొన్నారు.బంగాల్‌లో మొత్తం 294 అసెంబ్లీ స్థానాలకు రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. మొదటి దశ ఏప్రిల్ 23 కాగా, రెండో దశ 29న పోలింగ్ జరగనుంది. మే 24న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. 2021 బంగాల్ ఎన్నికల్లో టీఎంసీ 213 అసెంబ్లీ సీట్లు రాగా, బీజేపీకి 77 స్థానాల్లో గెలుపొందింది. ఈసారి ఎలాగైనా అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలని చూసుస్తోంది. అటు టీఎంసీ కూడా అదే ప్రయత్నంలో ఉంది.

# భారత్‌లో తొలిసారి ముంబైలో పట్టాలెక్కనున్న నాన్ - ఏసీ క్లోజ్డ్ డోర్ లోకల్ రైలు

**మొదటిపేజీ తరువాయి** - ఉన్న లోకల్ రైలును ప్రవేశపెట్టేందుకు సిద్ధమైంది. రద్దీగా ఉండే రైళ్ల నుంచి ప్రయాణికులు జారిపడి జరిగే ప్రమాదాలను నివారించడంతో పాటు తీవ్రమైన వేడి నుంచి ఉపశమనం కల్పించడం ఈ కొత్త రైలు రూపకల్పన వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.ప్రస్తుతం ముంబైలో కేవలం ఖరీదైన ఏసీ లోకల్ రైళ్లకు మాత్రమే ఆటోమేటిక్ క్లోజ్డ్ డోర్ వ్యవస్థ ఉంది. అయితే, సాధారణ తరగతి ప్రయాణికులకు కూడా ఏసీ రైళ్ల తరహా భద్రతను తక్కువ ధరకే అందించాలనే లక్ష్యంతో ఈ వినూత్న రైలును రూపొందించారు. ఇందులో ఏసీ లేనప్పటికీ, ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా 'ఫోర్స్డ్ వెంటిలేషన్ సిస్టమ్' అనే అధునాతన సాంకేతికతను అమర్చారు. ఈ వ్యవస్థ రైలు డోర్లు మూసి ఉన్నా కూడా కోచ్‌లలోకి నిరంతరం స్వచ్ఛమైన గాలిని పంపింగ్ చేస్తుంది. తద్వారా సాధారణ రైళ్ల కంటే ఎక్కువ గాలి ప్రసరణ జరిగి, లోపల వాతావరణం చల్లగా ఉంటుంది.ఈ సరికొత్త రైలు రేక్‌ను చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో తయారు చేశారు. త్వరలోనే ముంబై సబర్బన్ ట్రాక్‌లపై దీని ట్రయల్స్ ప్రారంభం కానున్నాయి. ప్రయాణికుల భద్రత, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఇందులో మరిన్ని ఆధునిక సదుపాయాలు కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో గార్డు లేదా మోటార్‌మ్యాన్‌తో మాట్లాడేందుకు 'టాక్-బ్యాక్' సిస్టమ్, మెరుగైన సీటింగ్ అమరిక, ఎల్ఈడీ లైటింగ్, రాబోయే స్టేషన్ల వివరాలను ప్రదర్శించే జీపీఎస్ ఆధారిత ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ వంటివి ఇందులో ఉన్నాయి.ఈ రైలు టికెట్ ధరలపై ఇంకా అధికారిక ప్రకటన రానప్పటికీ, ఏసీ లోకల్ రైలు ఛార్జీల కంటే గణనీయంగా తక్కువగా, సాధారణ ఫస్ట్ క్లాస్ లేదా సెకండ్ క్లాస్ ధరలకు దగ్గరగా ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ట్రయల్స్



విజయవంతమైతే, ముంబై రైల్వే నెట్‌వర్క్‌ను ఆధునికీకరించే ప్రణాళికలో భాగంగా ఇలాంటి మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టాలని రైల్వే బోర్డు యోచిస్తోంది.

# ఏపీ ఇంటర్ ఫలితాల విడుదల,12 ఏళ్లలోఎన్నడూ లేనంతగా ఉత్తీర్ణత!

**మొదటిపేజీ తరువాయి** - ఆంధ్రప్రదేశ్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ ఫలితాలను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు. గడిచిన 12 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలను సాధించారని మంత్రి వెల్లడించారు. ఈ ఏడాది కూడా ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు.ఈ ఏడాది సుమారు 10.50 లక్షల మంది పరీక్షలకు హాజరయ్యారని లోకేశ్ తెలిపారు. గత 12 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఈ ఏడాది అత్యధిక శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. ఫస్టియర్లో 77 శాతం మంది విద్యార్థులు (3,61,526) పాసవ్వగా.. సెకండియర్లో 81 శాతం మంది విద్యార్థులు (3,59,816) ఉత్తీర్ణులైనట్లు వెల్లడించారు. ఫస్టియర్లో బాలురు 72 శాతం, బాలికలు 81 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్లో బాలురు 76 శాతం, బాలికలు 85 శాతం




పాసయ్యారు. ఒకేషనల్ కోర్సులో ఫస్టియర్ లో 61%, సెకండియర్ లో 74% మంది పాసయ్యారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా తొలి ఏడాది 54 శాతం మంది, ద్వితీయ సంవత్సరం 68 శాతం మంది ఉత్తీర్ణత సాధించారని లోకేశ్ కితాబునిచ్చారు. ఇది విద్యార్థులు, ప్రిన్సిపాల్స్, జూనియర్ లెక్చరర్ల కష్టానికి ఫలితమని కొనియాడారు.

ఫలితాలను చెక్ చేసుకునే విధానం:

వెబ్‌సైట్: విద్యార్థులు resultsbie.ap.gov.inలో తమ హాల్ టికెట్ నంబర్ ద్వారా ఫలితాలు పొందవచ్చు.

వాట్సప్: 9552300009 నంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ పంపి, హాల్ టికెట్ నంబర్ ఎంటర్ చేస్తే నేరుగా రిజల్ట్ వాట్సప్‌కే వస్తుంది.

ఫలితాల విడుదల సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయిన విద్యార్థులు నిరాశ చెందవద్దని, సప్లిమెంటరీ పరీక్షల్లో పట్టుదలతో చదివి పాస్ కావాలని సూచించారు. ఈ సమయంలో తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు మానసిక మద్దతునివ్వాలని విజ్ఞప్తి చేశారు.

# దక్షిణాదికి అన్యాయం జరిగితే తీవ్ర పోరాటం తప్పదు

**మొదటిపేజీ తరువాయి** - దేశవ్యాప్తంగా నియోజకవర్గాల పునర్విభజనను అమలును వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్ బిల్లులను రేపటి నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టనుంది. ఈ బిల్లులు ఆమోదం పొందితే 2029 సాధారణ ఎన్నికల నాటికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాజకీయ ముఖచిత్రాలు సమూలంగా మారనున్నాయి. ఈ నేపథ్యంలో, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర ప్రభుత్వానికి స్పష్టమైన హెచ్చరిక జారీ చేశారు. దక్షిణాది రాష్ట్రాల రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించేలా ఈ ప్రక్రియ జరిగితే, అది దేశవ్యాప్త ప్రజా ఉద్యమానికి దారి తీస్తుందని ఆయన స్పష్టం చేశారు. జనాభా నియంత్రణ పాటించి, అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న దక్షిణ రాష్ట్రాలకు ఈ పునర్విభజన శాపంగా మారకూడదని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. అభివృద్ధిని ప్రోత్సహించాల్సింది పోయి, ప్రాతినిధ్యాన్ని తగ్గించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని మండిపడ్డారు.డీలిమిటేషన్ వల్ల దక్షిణాదికి సీట్లు తగ్గితే, అది కేవలం రాజకీయ ప్రక్రియగా మిగిలిపోదని... మొత్తం దక్షిణ భారతదేశం అంతటా ఒక తీవ్రమైన ప్రజా పోరాటానికి నాంది పలుకుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో బీఆర్ఎస్ పార్టీ గత మూడేళ్లుగా తీసుకున్న స్టాండ్‌కే కట్టుబడి ఉందని, ఇందులో ఎలాంటి మార్పు లేదని తెలిపారు.తామంతా గర్వించదగ్గ భారతీయులమని, దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నామని పేర్కొంటూ... పార్లమెంటులో తమ ప్రజల స్వరాన్ని అణచివేయాలని చూస్తే నిశ్శబ్దంగా ఉండబోమని హెచ్చరించారు. ఢిల్లీ పాలకులు వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకోవాలని,



దక్షిణాది ప్రజల హక్కుల విషయంలో బుద్ధిగా వ్యవహరించాలని ఆయన తన సోషల్ మీడియా పోస్ట్‌లో పేర్కొన్నారు.

# బలవంతపు భూసేకరణ ఆపకపోతే ఉద్యమం ఉద్ధృతం



**మొదటిపేజీ తరువాయి** - పారిశ్రామికీకరణ పేరుతో పరిగి ప్రాంత రైతుల నుంచి బలవంతంగా సాగు భూములను లాక్కుంటున్నారంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రత్యక్ష పోరాటానికి దిగారు. వికారాబాద్ ఆర్‌డీవో కార్యాలయం వద్ద వందలాది మంది రైతులతో కలిసి ఆమె భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, భూసేకరణ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.తాతల కాలం నాటి సారవంతమైన భూములను నమ్ముకుని బతుకుతున్న అన్నదాతల పొట్ట కొట్టడం అన్యాయమని కవిత ఈ సందర్భంగా మండిపడ్డారు. రైతుల సమ్మతి లేకుండా ఏ ఒక్క ఎకరా భూమిని తీసుకోవడానికి వీల్లేదని, ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ఈ పోరాటాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. పారిశ్రామికీకరణ ముసుగులో భూసేకరణకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. కవిత పిలుపుతో ఈ ఆందోళనలో స్థానిక నాయకులు, తెలంగాణ జాగృతి కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో వికారాబాద్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పరిస్థితిని గమనించిన పోలీసులు అక్కడ భారీగా మోహరించారు. కవిత రాకతో ఈ భూపోరాటం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

# మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంపూర్ణ మద్దతు



**మొదటిపేజీ తరువాయి** - రాజకీయాలపై వారి మధ్య చర్చ జరిగింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు బీఆర్ఎస్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని, కానీ నియోజకవర్గాల పునర్విభజన బిల్లు విషయానికి వస్తే మాత్రం దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని అన్నారు.చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు బీఆర్ఎస్ పూర్తి మద్దతు తెలుపుతుందని కేసీఆర్ ప్రకటించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే అసెంబ్లీలో మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం తీర్మానం చేశామని గుర్తు చేశారు. ఈ బిల్లుకు రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలుకుతారని తెలిపారు. అదే సమయంలో నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై కేసీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగేలా బిల్లు ఉంటే అంగీకరించేది లేదని స్పష్టం చేశారు. ప్రస్తుతం లోక్ సభలో దక్షిణాది రాష్ట్రాలకు 24 శాతం సీట్లు ఉన్నాయని గుర్తు చేశారు. పునర్విభజన తర్వాత ఈ శాతం ఏమాత్రం తగ్గకూడదని సూచించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణ పాటించిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని హెచ్చరించారు.బిల్లులోని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత నియోజకవర్గాల పునర్విభజన బిల్లుపై పార్టీ తుది నిర్ణయం తీసుకుంటుందని కేసీఆర్ తెలిపారు. అంతవరకు మనం తొందరపడకూడదని పార్టీ నాయకులకు సూచించారు. ఈ నెల 20న జగిత్యాలలో నిర్వహించనున్న బహిరంగ సభ, ఏప్రిల్ 27న పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



## ఎంపీ వద్దిరాజు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి తలసాని తదితర ప్రముఖులతో కలిసి వైశాఖి ఉత్సవాలకు హాజరు




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) ఏప్రిల్ 15 :** ఖల్సా సాధించిన దివాస్ (వైశాఖి)ఉత్సవాలు హైదరాబాద్ అమీర్ పేట ప్రభంధక్ కమిటీ గురుద్వారా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా జరిగాయి.వైశాఖి 327వ ఉత్సవాలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టీ.రామారావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర,తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితర ప్రముఖులు హాజరై రిటైర్డ్ ఐపిఎస్ ఆఫీసర్ తేజ్ దీప్ కౌర్, గురుద్వారా కమిటీ ప్రముఖులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కేటీఆర్, రవిచంద్ర, శ్రీనివాస్ యాదవ్ తదితర ప్రముఖులు కమిటీ నాయకులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు.

## పెదకొమెర గ్రామంలో సీ.ఎం.ఆర్.ఎఫ్. చెక్కుల పంపిణీ.





**గంపలగూడెం, ఏప్రిల్ 15(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** గంపలగూడెం మండలం, పెద కొమెర గ్రామంలో దిరిశాల సావిత్రి కు వారి నివాసం వద్ద 25,166/- రూపాయల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా అయన సావిత్రి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని, ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు.అలాగే భవిష్యత్తులో కూడా ఇలాంటి అవసరాల కోసం ఎవరైనా ఇబ్బందులు ఎదుర్కొంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు అవసరమైన ప్రతి సహాయాన్ని అందించేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటామని హామీ ఇచ్చారు.పెద్ద కొమెర గ్రామంలో మహానుభావులు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు.ఈ కార్యక్రమంలో పెద్ద కోమర గ్రామ టిడిపి అద్యక్షులు వేముల బాలయ్య.టిడిపి.నాయకులు,కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## 59వ డివిజన్‌లో ఘనంగా పోషణ పక్వాడా కార్యక్రమం

### ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ రావి రాంబాబు



**కొత్తగూడెం కార్పొరేషన్ ఏప్రిల్ 15 (వార్త సంధ్య) :** కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని 59వ డివిజన్ కూలీలైన్ 2, 3, 4, 5, 15 సెంటర్‌ల లో 8వ రాష్ట్రీయ పోషణ పక్వాడా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ రావి రాంబాబు మరియు సెక్టార్ సూపర్వైజర్ శారద పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. ముఖ్యంగా చిరుధాన్యాలతో తయారైన ఆహార పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలు అధికంగా తీసుకోవాలని సూచించారు. గర్భిణీలు, పాలిచ్చే తల్లులు, కిశోర బాలికలు మరియు చిన్నపిల్లలు పౌష్టికాహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. ఈ సందర్భంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం కార్పొరేటర్ చేతుల మీదుగా నిర్వహించారు. అలాగే "బేటి జన్మోత్సవం" సందర్భంగా మార్చి నెలలో పుట్టిన ఆడపిల్లలకు ఉపయోగపడే కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావి రాంబాబు, సూపర్వైజర్ శారద, హబ్ టీం సభ్యులు సంతోషి, రూప, సౌజన్య, అంగన్వాడీ టీచర్స్ రత్నకుమారి, మాధవి, ధనలక్ష్మి, జరీనా బేగం, శారద మరియు అంగన్వాడీ ఆయాలు, తల్లులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రోడ్డు భద్రతే జీవన రక్ష: కూకట్పల్లిలో 'ఆరైవ్ ఆలైవ్' అవగాహన సదస్సు





**వార్తా సంధ్య కూకట్పల్లి :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కూకట్పల్లి జెనెసిస్ స్కూల్‌లో బుధవారం కూకట్పల్లి పోలీసుల ఆధ్వర్యంలో ఆరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సదస్సుకు కూకట్పల్లి అదనపు డీసీపీ సుదర్శన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు, యువతకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ సుదర్శన్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరగడానికి ప్రధాన కరణం సరైన నిద్ర లేకపోవడం, గమ్యస్థానానికి తొందరగా చేరుకోవాలనే ఆత్రుత ప్రాణాల మీదకు తెస్తోంది. ప్రతి ఒక్కరూ స్టార్ట్ ఎర్లీ గో స్లోలీ రీచ్ సేఫ్లీ (త్వరగా బయలుదేరండి - నిమ్మదిగా వెళ్లండి - సురక్షితంగా చేరండి) అనే సూత్రాన్ని పాటించాలని ఆయన కోరారు. జుట్టు రాలిపోతుందనే చిన్నపాటి అపోహతో హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. మానవ ప్రాణం ఎంతో అమూల్యమైనది. మీపై ఆధారపడిన కుటుంబ సభ్యుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వాహనాలు నడపాలి నేటి కాలంలో విద్యార్థులు, యువత ఎక్కువగా రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, అందుకే వారిలో మార్పు తీసుకురావడానికి ఇలాంటి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెనెసిస్ స్కూల్ విద్యార్థులతో పాటు కూకట్పల్లి లా & ఆర్డర్ ఎస్ హెచ్ ఓ , ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ, పోలీసు అధికారులు మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## జేఎన్టీయూలో విద్యార్థుల మధ్య చిచ్చు : చల్లా రామకృష్ణ రెడ్డిపై చర్యలకు డిమాండ్



**వార్తా సంధ్య కూకట్‌పల్లి :** జేఎన్టీయూ ప్రతిష్టను దిగజారుస్తూ, విద్యార్థుల మధ్య వైషమ్యాలు సృష్టిస్తున్న చల్లా రామకృష్ణ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వివిధ విద్యార్థి సంఘాలు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశాయి. స్టూడెంట్స్ ప్రొటెక్షన్ ఫోరం, బంజార విద్యార్థి సంఘం, జేఏసీ, బిఆర్ఎస్వి నాయకులు మాట్లాడుతూ.. రామకృష్ణ రెడ్డి తన రాజకీయ స్వప్రయోజనాల కోసం అమాయకపు మొదటి సంవత్సరం విద్యార్థులను వాడుకుంటున్నారని ఆరోపించారు. చిన్న విషయాలను పెద్దవి చేసి విద్యార్థులపై తప్పుడు కేసులు పెట్టించడం, కేసులను వెనక్కి తీసుకోకుండా బెదిరించడం, విద్యార్థులను వ్యసనాలకు బానిసలుగా మార్చి వారి జీవితాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత, గిరిజన విద్యార్థుల పట్ల కుల వివక్ష చూపుతున్నారని, ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఉన్నా ఆగడాలు కొనసాగుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. వర్సిటీలో రాజకీయ అనుబంధ సంఘాల జోక్యం లేకుండా చూడాలని, వెంటనే రామకృష్ణ రెడ్డి పీహెచ్‌డీ అడ్మిషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు దిలీప్, భాను ప్రకాశ్, సాయి విశ్వగ్న తదితరులు పాల్గొన్నారు.

## సెవెన్ టూంబ్స్ కటోరా హౌస్, కేబీ మ్యూజియం ను ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ తో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించిన పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) ఏప్రిల్ 15 :** కుతుబ్ షాహీ టూంబ్స్ లోని ఇంటర్ప్రిటేషన్ సెంటర్ లో జరుగుతున్న పనులను పరిశీలించారు. వక్ఫ్ ట్రిబ్యునల్ లో కేసు పెండింగ్ గురించి చర్చించారు. కేసు పూర్వాపరాలను గురించి వివరించారు. ట్రిబ్యునల్ పరిధిలో పెండింగ్ లో ఉన్న పనులను మినహాయించి, మిగిలిన పనులను వారంలోగా ప్రారంభించి, వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోప్ వే కుతుబ్ షాహి టూంబ్స్ నుంచి గోల్కొండ కోట వరకు 1.3 కిలోమీటర్ల రోప్ వే నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ఏ స్థాయిలో ఉన్నాయని ఆరా తీశారు. క్లియరెన్స్ స్టేజిలో ఉన్నాయని, ఆయా శాఖల నుంచి అనుమతులు వచ్చిన వెంటనే డీపీఆర్ సిద్ధం చేస్తామని అధికారులు చెప్పారు. అనంతరం కటోరా హౌస్ ను సందర్శించారు. పురావస్తు శాఖ, , కులీకుతుబ్ షా అర్బన్ డెవలప్మెంట్ ఆటోఆరిటీని సమన్వయం చేసుకుని , డీపీఆర్ ను సిద్ధం చేయాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. కటోరా హౌస్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. కటోరా హౌసే పరిసర ప్రాంతాల్లో ఉన్న వ్యర్థాలను వెనువెంటనే తొలగించాలని అధికారులు ఆదేశించారు. తర్వాత గోల్కొండ కోట సమీపంలోని బస్ స్టాప్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో లాడ్ బజార్ తరహాలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాన్నారు. ఈ ప్రతిపాదనలను నేషనల్ మోనుమెంట్ మిషన్ అథారిటీకి పంపి అనుమతులు పొందాలని సూచించారు. అక్కడి నుంచి ఖజానా బిల్డింగ్ మ్యూజియంకు చేరుకున్నారు. ఎంతో చారిత్రాత్మక విలువైన కళాఖండాలు ఉన్న ఈ మ్యూజియంను పర్యాటకంగా అభివృద్ధి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ ప్రదేశంలో చేనేత వస్త్రాల ( ఖాదీ) ప్రదర్శన ను ఏర్పాటు చేయాలని పురావస్తు , టీజీటీడీసీ, అధికారులను ఆదేశించారు. కేబీ మ్యూజియం వెనక భాగంలో ఉన్న ఆక్రమణలను పోలీస్ శాఖ సహకారంతో వారం రోజుల్లో తొలగించాలని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. తెలంగాణలో అద్భుతమైన చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపద, ప్రకృతి రమణీయ ప్రదేశాలు ఉన్నాయని, వాటిని ప్రపంచ పర్యాటకులకు పరిచయం చేసేలా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా వాటిని అభివృద్ధి చేయడంతో పాటు మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజీటీడీసీ ఎండీ గౌతమి, పురావస్తు శాఖ డైరెక్టర్ అర్జున రావు, ఇతర శాలల అధికారులు పాల్గొన్నారు.






## అంబేద్కర్ స్ఫూర్తితో ముందుకు పోవాలి: వాణి ప్రసాద్






**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) ఏప్రిల్ 15 :** భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చూపించిన బాటలో సమాజమంతా ముందుకు ప్రయాణం చేయాలని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ గశ్రీ పిలుపునిచ్చారు. ఇప్పుడు దేశంలో నిజమైన ప్రగతి అంటే అన్ని వర్గాలకు సమంగా అందే అభివృద్ధి మాత్రమే అని చెబుతూ అంబేద్కర్ చలనచిత్రాన్ని తెలుగు లలిత కళా తోరణంలో ప్రారంభించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ తెలుగు లలితకళా తోరణంలో అంబేద్కర్ చలనచిత్రాన్ని ఓపెన్ థియేటర్లో ప్రజల కోసం ఉచితంగా ప్రదర్శించింది. ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ వాణి ప్రసాద్ ఈ చలన చిత్రాన్ని పూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పురావస్తు శాఖ సంచాలకులు అర్జున్ రావు, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, భాషా సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులు దినకర్, పల్లె నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## లోక్‌సభ సీట్లను ప్రోరాటా పద్ధతిలో పెంచే ప్రతిపాదన దక్షిణాది రాష్ట్రాలకు నష్టం చేస్తుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య ) ఏప్రిల్ 15 :** దక్షిణాది రాష్ట్రాలు దీనికి వ్యతిరేకంగా నిలబడాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ కు లేఖ రాశారు. మహిళల రిజర్వేషన్, డిలిమిటేషన్, లోక్‌సభ సీట్ల పెంపు అనే మూడు వేర్వేరు అంశాలను కలిపి ప్రజల్లో గందరగోళం సృష్టిస్తున్నారని లేఖలో ప్రస్తావించారు. లోక్‌సభ సీట్లను 543 నుంచి 850కు పెంచి ప్రోరాటా పద్ధతిలో పంచితే దక్షిణ రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గిపోతుందని అప్రమత్తం చేశారు. దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకునే రాష్ట్రాలు నష్టపోతూ, జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలు లాభపడే పరిస్థితి వస్తుందని అన్నారు. అందుకే అన్ని రాష్ట్రాలకు న్యాయం జరిగేలా హైబ్రిడ్ మోడల్‌ను పరిశీలించాలని, ఈ అంశంపై రాష్ట్రాలు ఐక్యంగా ముందుకు రావాలని ఆయన కోరారు.

## పాపారావుకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జాతీయ పురస్కారం...



**తిరువూరు, ఏప్రిల్ 15(వార్త సంధ్య):-ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** ఆంధ్రప్రదేశ్ లోని గంగాదర్ నెల్లూరు జిల్లా,కోట మండలంలో అంబేద్కర్ 135 వ జయంతి ఉత్సవాలు పురస్కరించు కొని వివిధ రంగాలలో ప్రతిభ కనబర్చిన ప్రముఖులకు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జాతీయ పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమం ఎం.వి.రావు ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో బుధవారం నిర్వాహించారు.ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు పట్టణం లో గల శ్రీవాహిని ఇంజనీరింగ్ కళాశాల ఎం.బీ.ఏ హెచ్.ఓ.డి. మద్దాల పాపారావు విద్యారంగం లో విశిష్ట సేవలకు కనబరచినందుకు గాను డా.బాబా సాహెబ్ అంబేద్కర్ జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం 2026ను ఎం.వి.ఆర్ చైర్మన్ లీలా మోహన్ కృష్ణ, మా టీవీ సీ.ఈ.వో జ్యోతి మరియు ఎస్పీ బాలసుబ్రమణ్యం సహచరుడు కళాంజలి చేతుల మీదుగా అందుకున్నారు.

## తిరువూరు లక్ష్మీపురం క్రాస్ రోడ్డు వద్ద 'హెల్మెట్ అవేర్‌నెస్ డ్రైవ్'..



**తిరువూరు,ఏప్రిల్ 15(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ తమ ప్రాణాలను కాపాడుకోవాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ రాజశేఖర బాబు ఆదేశాల మేరకు, రూరల్ డి.సి.పి. లక్ష్మి నారాయణ ఉత్తర్వుల ప్రకారం మైలవరం సబ్ డివిజన్ పరిధిలో బుధవారం భారీ తనిఖీలు మరియు అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చారు.మైలవరం సబ్ డివిజన్ ఏసిపి, మరియు తిరువూరు సి.ఐ. గిరిబాబు నేతృత్వంలో మండలంలోని లక్ష్మీపురం క్రాస్ రోడ్డు వద్ద 'హెల్మెట్ అవేర్‌నెస్ డ్రైవ్' కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారు లను ఆపి, వారికి రోడ్డు ప్రమాదాల తీవ్రత గురించి పోలీసులు వివరించారు. ద్విచక్ర వాహనంపై వెళ్లే సమయంలో తలకు తగిలే చిన్న దెబ్బ కూడా ప్రాణాంతకంగా మారుతుందని, కుటుంబ సభ్యుల క్షేమం దృష్ట్యా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని కోరారు.ఈ సందర్భంగా సీ.ఐ.గిరిబాబు మాట్లాడుతూ,పోలీసులు జరిమానా వేస్తారనే భయంతో కాకుండా, తమ ప్రాణరక్షణ కోసం వాహనదారులు హెల్మెట్ ధరించాలి. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. శాతకర్ణి , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విస్సన్నపేట మండలశీలో సి.ఎం.ఆర్.ఎఫ్. చెక్కుల పంపిణీ





**విస్సన్నపేట,ఏప్రిల్ 15(వార్త సంధ్య):- ఎన్టీఆర్ జిల్లా,తిరువూరు నియోజకవర్గం :** విస్సన్నపేట మండల పరిధిలోని కొర్లమండ, పుట్రెల, విస్సన్నపేట గ్రామాలకు చెందిన ముగ్గురు లబ్ధిదారులకు మొత్తం రూ. 72,909/- విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి సి.ఎం.ఆర్.ఎఫ్.చెక్కులను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపంపిణీ చేశారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్న ప్రజలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా అనేక కుటుంబాలు ఆర్థిక సహాయం పొందుతున్నాయని తెలిపారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. అలాగే, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంపొందించుకొని, అవసర మైనప్పుడు వినియో గించు కోవాలని సూచించారు.లబ్ధి దారులు ప్రభుత్వం అందించిన ఈ సహాయానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్య క్రమంలో స్థానిక కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## కాచిగూడ ఎస్ సి హాస్టల్ ను పూనర్ నిర్మించాలి



**హైదరాబాద్ (వార్త సంధ్య) ఏప్రిల్ 15 :** నిర్మించారుప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొస్త్రని వచ్చే విద్యా సంవత్సరం నాటికి కాచిగూడ ఎస్సీ హాస్టల్ పునర్నిర్మించి, అందుబాటులోకి తీసుకు రావాలని ఎస్సీ హాస్టల్ పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు ప్రొఫెసర్ యాదగిరి విజ్ఞప్తి చేశారు. కాచిగూడ ఎస్సీ హాస్టల్ పునర్నిర్మాణం కోసం ప్రభుత్వం రూ.25 కోట్లు కేటాయించినందుకు నింబోలిఅడ్డ ఎస్సీ హాస్టల్ లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ యాదగిరి మాట్లాడుతూ హాస్టల్ ను త్వరితగతిన అన్ని అంగులతో నిర్మించి, పూర్వ వైభవాన్ని తీసుకు రావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ హాస్టల్లో చదివిన విద్యార్థులు ప్రొఫెసర్లు, డాక్టర్లు, విద్యావేత్తలు, పారి శ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులుగా ఎదిగారని ఆయన గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో దశరథ, ప్రొఫెసర్ శేఖర్, మరియాదాస్, బాల్ గోవింద్, నీలం వెంకన్న, బురికి రాములు, శీలం ప్రభాకర్, న్యాయ వాది వెంకట్, అర్జున్ తో పాటు ఇందులో చదివిన న్యాయవాదులు, డాక్టర్లు, పారిశ్రామికవేత్తలు, పాల్గొన్నారు.

## "జై భీమ్ నినాదాలతో మార్మోగిన పెద్ద చీకోడ్"

### గ్రామ సర్పంచ్ కొమిరే నరేష్ ఆధ్వర్యంలో ఘనంగా అంబేద్కర్ జయంతి ర్యాలీ




**(వార్త సంధ్య) ఏప్రిల్ 15 :** దుబ్బాక మండలం పెద్ద చీకోడ్ గ్రామంలో మంగళవారం సాయంత్రం అంబేద్కర్ జయంతి సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ గ్రామ సర్పంచ్ కొమిరే నరేష్ మరియు అఖిల్ రాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తౌడ సత్య నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా మహిళలు కోలాటం ఆడుతూ, యువతి యువకులు డాన్సలతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామం మొత్తం "జై భీమ్" నినాదాలతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొండల్ రెడ్డి, వార్డు సభ్యులు,అఖిల్ రాజ్ ఫౌండేషన్ సభ్యులు,మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అందరి సహకారంతో ర్యాలీ విజయవంతంగా ముగిసింది.

## పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి,ఏప్రిల్ 15:** ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శ్రీ కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం లో స్వామి వారికి విశేషంగా నిర్వహించిన "లక్ష తమలపాకుల" పూజ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ లావణ్య , చైర్మన్ సత్యనారాయణ రెడ్డి సుధీర్ రెడ్డి కి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ముద్ద రాజేశ్వరి, మాజీ ధర్మకర్తలు ముద్ద కళ్యాణ్, మధు సాగర్, యాది రెడ్డి, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మండల స్థాయి సభలను విజయవంతం చేయాలి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశాలు

**ఏప్రిల్ 16 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణ అధికారులకు కీలక సూచనలు**

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, వార్త సంధ్య :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 16 నుంచి నిర్వహించనున్న మండల స్థాయి సభలను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయం నుండి టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, ఎంపిడీఓలు, మున్సిపల్ కమిషనర్లు మరియు ఇతర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆయన, సభల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు ప్రతి మండలంలో పాఠశాలలు, మండల కార్యాలయాలు లేదా అనువైన బహిరంగ ప్రదేశాల్లో ఉదయం 10 గంటలకు సభలను ప్రారంభించాలని సూచించారు. మండల స్థాయి సభల్లో ప్రజా ప్రతినిధులను తప్పనిసరిగా భాగస్వామ్యం చేయాలని, గౌరవ



మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు ముందస్తుగా సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. సభలను రాష్ట్ర గీతంతో ప్రారంభించి, ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. అలాగే, ప్రస్తుతం అమలులో ఉన్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై చర్చలు జరపాలని, సభలకు తహశీల్దార్‌లు, ఎంపిడీఓలు, వార్డు సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు, స్వయం సహాయక సంఘాలు, యువత, రైతులు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనేలా చూడాలని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సభల్లో పాల్గొనే ప్రజలకు త్రాగునీరు, నీడ వంటి సౌకర్యాలు కల్పించాలని, మహిళలు, వృద్ధులు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రదర్శన కోసం స్క్రీన్, ప్రొజెక్టర్ ఏర్పాటు చేయాలని, సభ ప్రాంగణంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికకు సంబంధించిన బ్యానర్లు ప్రదర్శించాలని ఆదేశించారు.

అధికారులు అందరూ సమన్వయంతో పని చేసి మండల స్థాయి సభలను విజయవంతం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) శ్రీనివాస్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, ఆర్డీఓలు, జిల్లా పరిషత్ సీఈఓ కృష్ణ రెడ్డి, సిపిఓ సౌమ్య, ఎంపిడీఓలు, మున్సిపల్ కమిషనర్లు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తీవ్ర ఎండలపై అప్రమత్తంగా ఉండాలి
## : జిల్లా వైద్యాధికారి డా. కే. లలితాదేవి సూచనలు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో వార్త సంధ్య :** రాష్ట్రంలో ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో తీవ్ర ఎండల ప్రభావం పెరుగుతోందని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కే. లలితాదేవి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు పాటించాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మజ్జిగ, కొబ్బరినీరు, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి ద్రావణాలు తరచుగా తీసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు ఎండలో బయటకు వెళ్లకుండా ఉండాలని, తప్పనిసరిగా వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపీ, తలపాగా, సన్ గ్లాసెస్ ఉపయోగించాలని తెలిపారు. అలాగే లేత రంగు, సడలైన పత్తి దుస్తులు ధరించాలి అన్నారు. పిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పరిశుభ్రమైన మరియు తాజా ఆహారం తీసుకోవాలని సూచించారు.

చేయకూడనివి: ఎండలో ఎక్కువసేపు తిరగకూడదు. కఠినమైన శారీరక శ్రమ చేయకూడదు. మద్యపానం, కార్బోనేటెడ్ పానీయాలు, అధికంగా టీ మరియు కాఫీ తీసుకోవడం నివారించాలి. నూనె పదార్థాలు మరియు మసాలా ఆహారం తగ్గించాలి.

హీట్ స్ట్రోక్ లక్షణాలు: అధిక జ్వరం, తలనొప్పి, తల తిరగడం, వికారం, వాంతులు, చర్మం ఎర్రగా మరియు పొడిగా మారడం, తీవ్రమైన అలసట, గందరగోళం లేదా స్పృహ కోల్పోవడం, గుండె వేగంగా కొట్టుకోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

అత్యవసర చర్యలు: హీట్ స్ట్రోక్ బాధితుడిని వెంటనే చల్లని ప్రదేశానికి తరలించి, శరీరాన్ని చల్లటి నీటితో తడపాలి. పరిస్థితి విషమిస్తే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలి. అత్యవసర సహాయం కోసం 108 అంబులెన్స్ సేవలకు కాల్ చేయాలని సూచించారు. చివరగా, ప్రజలందరూ ఈ సూచనలను పాటించి తీవ్ర ఎండల ప్రభావం నుంచి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డా. లలితాదేవి కోరారు.

## రబీ ధాన్యం సేకరణకు సిద్ధం కావాలి
## మిల్లర్లకు అదనపు కలెక్టర్ సూచనలు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో వార్త సంధ్య:** రాబోయే రబీ సీజన్ 2025-26 వరి ధాన్యం సేకరణను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి సూచించారు. బుధవారం జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, డీఎంసీఎస్ (ఐవీజూ) అధికారులు, మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రబీ సీజన్‌లో పెద్ద ఎత్తున ధాన్యం సేకరణ జరగనున్న నేపథ్యంలో నిల్వ సదుపాయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. గోదాముల్లో స్థలం కొరత లేకుండా ఉండేందుకు సిఎంఆర్ డెలివరీ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్లను ఆదేశించారు. అలాగే, విసి & ఎండి (ఎజ & వీణ) జారీ చేసిన సవరించిన ఒప్పందం ప్రకారం రబీ 2025-26 వరి ధాన్యం కస్టమ్ మిల్లింగ్ కార్యకలాపాల కోసం సంబంధిత జిల్లా మేనేజర్‌తో ఒప్పందాలు కుదుర్చుకోవాలని స్పష్టం చేశారు. గత సీజన్లలో వినియోగించిన గోనె సంచులను తిరిగి అందజేయడంలో ఆలస్యం చేయకూడదని, ఉపయోగించగలిగిన పాత సంచులను గరిష్టంగా డీఎంసీఎస్‌కు అప్పగించాలని సూచించారు. ఇక వరి సేకరణ ప్రక్రియ అంతరాయం లేకుండా సాగేందుకు సివిల్ సప్లైస్ కమిషనర్ జారీ చేసిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని మిల్లర్లకు సూచించారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యం సమయానికి ప్రాసెసింగ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. ఈ సమావేశంలో అధికారులు, మిల్లర్లు పాల్గొని రాబోయే సీజన్ ఏర్పాట్లపై చర్చించారు. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ పిలుపునిచ్చారు.

# మారనున్న లోక్‌సభ నియోజకవర్గాల రాజకీయ ముఖచిత్రం

**రాష్ట్రంలో కొత్తగా 9 లేదా 10 లోక్‌సభ స్థానాలు**

**2011 జనగణన ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన**

**ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలు**

**వేరుచేసి కొత్తగా మరో రెండు స్థానాలు**

**మహిళా నేతలకు పెరగనున్న రాజకీయ ప్రాధాన్యత**

పునర్విభజన బిల్లుతో తెలంగాణలో లోక్‌సభ నియోజకవర్గాల రాజకీయ ముఖచిత్రం పూర్తిగా మారిపోనుంది. ప్రస్తుతం ఉన్న నియోజకవర్గాలను విభజించి కొత్తగా మరో 9 లేదా 10 లోక్‌సభ స్థానాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో రాష్ట్రంలో లోక్‌సభ నియోజకవర్గాల స్థానాల సంఖ్య 17 నుంచి 26 లేదా 27కు పెరిగే అవకాశాలున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ నగరం కీలకంగా నిలుస్తుంది. నియోజకవర్గాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలను ఆధారంగా తీసుకుంటున్నారు. ఆ సమయంలో తెలంగాణ ప్రాంతంలో పది జిల్లాలున్నాయి. వీటిలో అత్యధికంగా రంగారెడ్డి ఉమ్మడి జిల్లా 52,96,741 జనాభాతో రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉండగా, దేశం వ్యాప్తంగా పరిశీలిస్తే 17వ ర్యాంకులో నిలిచింది. ఈ జిల్లా ప్రస్తుతం మల్కాజిగిరి, చేవెళ్ల, భువనగిరి, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గాలు పరిధిలో విస్తరించి ఉంది. వీటి పరిధులన్నీ పూర్తిగా మారిపోనున్నాయి. వాటి స్థానంలో కొత్త లోక్‌సభ నియోజకవర్గాలు రానున్నాయి. ఏ ప్రాంతం దేని పరిధిలోకి వస్తుంది అనే విషయం పునర్విభజన తర్వాతే తేలుస్తుంది.



**దేశంలోనే అగ్రస్థానం :** ప్రస్తుతమున్న హైదరాబాద్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, భువనగిరి నియోజకవర్గాల పరిధిలో జనాభా అధికంగా ఉన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని వీటిని విభజించి కొత్తగా 3 లేదా 4 ఏర్పాటుచేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానం 2024 ఎన్నికల సమయంలో 37.79 లక్షల మంది ఓటర్లను కలిగి ఉంది. ఇది దేశంలోనే అగ్రస్థానంలో ఉండటం గమనార్హం. ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాలు వేరుచేసి కొత్తగా మరో రెండు స్థానాలు రానున్నాయి. ఉమ్మడి మెదక్‌లో ప్రస్తుతం జహీరాబాద్, మెదక్ ఉండగా కొత్తగా మరొక స్థానం ఏర్పాటు కానుంది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్‌ను విభజించి అదనంగా మరొక స్థానం రానుంది. వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాలను విభవించి ఒకటి లేదా రెండు ఏర్పటు చేసే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.

మహిళలకు తొమ్మిది ఇవ్వాల్సిందే : ప్రస్తుతం మన రాష్ట్రం నుంచి లోక్‌సభలో ఇద్దరు మహిళా ఎంపీలు డీకే అరుణ, కడియం కావ్య మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఈ సంఖ్య ఏకంగా 9 గా ఉండనుంది. వీరంతా తెలంగాణ తరఫున లోక్‌సభలో అడుగుపెట్టనున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం పరిశీలిస్తే నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో మహిళలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. 2029 లోక్‌సభ ఎన్నికల నిర్వహించే సమయానికి 2026-27 జనాభా లెక్కలు అందుబాటులోకి రానున్నాయి.

**మహిళా నేతలకు రాజకీయంగా ప్రాధాన్యం :** నూతన జనగణన ఆధారంగానే వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో మహిళలకు సీట్లను రిజర్వు చేయనున్నట్లు తెలుస్తోంది. దీనిప్రకారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల నుంచి మహిళా ఎంపీలు లోక్‌సభకు వెళ్లే సూచనలున్నాయి. రాష్ట్రం యూనిట్‌గా తీసుకుని మహిళలకు లోక్‌సభ నియోజకవర్గాలను రిజర్వు చేయనున్నారని అధికారవర్గాలు అంటున్నాయి. సాధారణంగా పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన పార్టీలు మహిళలకు పెద్దగా టికెట్లు ఇవ్వడం లేదు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ముగ్గురికి, బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కొక్కరికి మాత్రమే సీటును కేటాయించాయి. 2029 ఎన్నికల్లో కచ్చితంగా ప్రతి పార్టీ వారికి 9 టికెట్లు ఇవ్వాల్సిందే. ఈ నేపథ్యంలో ఇప్పటి నుంచే మహిళా నేతలకు రాజకీయంగా ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని సీనియర్ నేతలు చెబుతున్నారు. 2024 ఎన్నికల్లో అన్ని లోక్‌సభ స్థానాలకు కలిపి 12,459 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా వారిలో 8,360 మంది చివరికి బరిలో నిలిచారు. వీరిలో మహిళలు 800 (9.6%) మంది మాత్రమే ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో 33 శాతానికి వారి వాటా పెరగనుంది. దేశవ్యాప్తంగా 47.63 కోట్ల మంది మహిళా ఓటర్లున్నారు.

# వడదెబ్బతో మరణిస్తే రూ.4లక్షల ప్రభుత్వ పరిహారం

**సింపుల్‌గా ఇలా దరఖాస్తు చేసుకోండి**

**రాష్ట్రంలో రోజురోజుకూ పెరగుతున్న ఉష్ణోగ్రతలు**

**వడదెబ్బ బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వ చర్యలు**

**బాధిత కుటుంబాలకు అండగా నిలిచేందుకు రూ.4లక్షల వరకు ఆర్థిక సాయం**

**దరఖాస్తు విధానం ఇదే**



రాష్ట్రంలో రోజురోజుకూ భానుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఈ ఎండలకు బయటకు రావాలంటేనే భయపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పొట్టకూటికోసం రోజంతా ఎండలో పనిచేసే కూలీలు, బాటసారులు వడదెబ్బ బారినపడి మృత్యువాత పడుతున్న ఘటనలు ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతున్నాయి. ఇలా దిక్కుతోచని స్థితిలో ఉన్నటువంటి బాధిత కుటుంబాలను ఆదుకోవాలనే లక్ష్యంతో ప్రభుత్వం రూ.4లక్షల వరకు ఆర్థిక భరోసాను కల్పిస్తోంది. అది ఎలా పొందాలి? ఏయే పత్రాలు అవసరం అనే విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

రూ. 4 లక్షల వరకు పరిహారం :

వడదెబ్బ కారణంగా మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి ప్రభుత్వం రూ.4లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తోంది.

ఈ నగదు 'స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డీఆర్ఎఫ్)' కింద మంజూరవుతుంది.

మరణించిన వెంటనే మృతదేహానికి ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించాలి.

వడదెబ్బతో మరణం సంభవించినప్పుడు స్థానిక పోలీస్ స్టేషన్‌తో ఫిర్యాదు చేయాలి. పోలీసులు పోస్ట్‌మార్టం నిర్వహించి కేసు నమోదు చేయాల్సి ఉంటుంది.

మరణించిన రోజున ఆ ప్రాంతంలో ఉష్ణోగ్రతలు సాధారణంకంటే అధికంగా ఉన్నాయని వాతావరణ శాఖ (ఐఎండీ) నుంచి ధ్రువీకరణ పత్రం అవసరం.

**దరఖాస్తుకు కావాల్సిన పత్రాలు ఇవే :**

ప్రభుత్వ ఆసుపత్రి ఇచ్చిన శవపరీక్ష రిపోర్టు

స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి ఎఫ్ఐఆర్(ప్రాథమిక సమాచార నివేదిక), ఫైనల్ రిపోర్ట్

డెత్ సర్టిఫికెట్(మరణ ధ్రువీకరణ పత్రం)

మృతుడి, వారసుల ఆధార్ కార్డుల జిరాక్సులు బ్యాంకు పాస్‌బుక్ వివరాలు (పరిహారం జమచేసేందుకు)

కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం

**దరఖాస్తు ఇలా :**

వడదెబ్బతో మరణం సంభవించిన వెంటనే స్థానిక రెవెన్యూ అధికారులకు సమాచారం అందించాలి.

అన్ని డాక్యుమెంట్లతో తహసీల్దారు ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలి.

రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేసి నివేదికను జిల్లా కలెక్టరుకు పంపిస్తారు.

అక్కడ ఆమోదం పొందాక నిధులు నేరుగా నామినీ అకౌంట్లో జమవుతాయి.

"చాలా మంది శవపరీక్ష చేయకుండా నిర్లక్ష్యం చేస్తుంటారు. వ్యక్తి మృతి చెందిన 24 గంటల లోపు తప్పనిసరిగా పోస్టుమార్టంను చేయాలి. రిపోర్టులో మరణానికి కారణం హైపర్‌థెర్మియా లేదా వడదెబ్బ అని వైద్యులు స్పష్టంగా పేర్కొనాలి. అలాంటప్పుడు మాత్రమే బాధిత కుటుంబానికి పరిహారం అందుతుంది""సాయిరాం, ఆర్డీవో, సికింద్రాబాద్

## జీవనది ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి,ఏప్రిల్ 15:** మంగళవారం డా.బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బొగ్గరాపు దయానంద్ గుప్తా హాజరయ్యారు. గౌరవ అతిథులుగా లయన్స్ క్లబ్ జిల్లా కార్యదర్శి (స్వచ్ఛ భారత్) డాక్టర్.బి.విజయ రంగ, కాంతి కృష్ణ ,రవి,మధు (ఈనాడు)మరియు జీవనది ఫౌండేషన్ సభ్యులు బెల్లం మాదవి,అనురాధ గౌడ్,హేమలత రెడ్డి,శివ పటోళ్ల,భవ్య రెడ్డి,కవిత,సరిత,సునీల్ కుమార్,సునీత,శ్రీలత, పలువురు విద్యావేతలు, డాక్టర్లు, అడ్వకేట్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. బాబాసాహెబ్ అంబేద్కర్ సేవలను గుర్తుచేసుకుంటూ వక్తలు ప్రసంగించారు. సమాజానికి నిస్వార్థంగా సేవ చేస్తున్న వారికి జీవనాది ఫౌండేషన్ చైర్మన్ శ్రీమతి ఇంటి లక్ష్మీ దుర్గ ముఖ్య అతిధులకు 12 పుష్కర నదుల పురసస్కారాలు లాయర్లకు డాక్టర్ బి.అర్.అంబేద్కర్ ఎక్స్ లెన్సి అవార్డులు ముఖ్య అతిధి చేతులమీదుగా అందజేశారు. సభను ఉద్దేశించి దయానంద్ గుప్తా మాట్లాడుతూ, వాసవి మరియు అనుబంధ సంస్థల ద్వారా గత 45 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నామని, ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తూ, ప్రస్తుతం ఎమ్.ఎల్.సి గా ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నామని తెలిపారు. అలాగే లయన్స్ క్లబ్ మరియు జీవనది ఫౌండేషన్ చేస్తున్న సేవలను అభినందించారు. లయన్ డాక్టర్.బి.విజయ్ రంగ మాట్లాడుతూ, మెడికల్, ఎడ్యుకేషన్ మరియు సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ రంగాలలో మరింత సేవలను అందిస్తామని తెలిపారు.

## కాంగ్రెస్ బూతు స్థాయి నుంచి బలోపేతం చేయాలి

**:టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్**



**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, ఏప్రిల్ 15:** బూత్ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు డివిజన్ అధ్యక్షులు కృషి చేయాలని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులతో సమావేశాన్ని మంగళవారం వనస్థలిపురంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక తదితర విషయాలలో భాగస్వామ్యం నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలన్నారు. త్వరలో జరగనున్న ఎస్ఐఆర్ లో ఓటర్ల తొలగింపు, చేర్పులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని.. కాంగ్రెస్ పార్టీ తరఫున బూత్ ఏజెంట్లు ఇందుకు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి గజ్జి భాస్కర్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు మకుటం సదాశివుడు, శ్రీపాల్ రెడ్డి, బండా సురేందర్ రెడ్డి, డి.శశిధర్ రెడ్డి, బుడ్డా సత్యనారాయణ , లింగాల కిషోర్ గౌడ్, వేణుగోపాల్ యాదవ్, మంజుల రెడ్డి , మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, మెగావత్ గణేష్ నాయక్ , నాయకులు తులసి శ్రీనివాస్ , భీమిడి రామకృష్ణారెడ్డి, డేరంగుల కృష్ణ , గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి , గణేష్ రెడ్డి, దాము మహేందర్ యాదవ్ , కొండోజు శ్రీనివాస్ , రిజ్వాన్ , శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## పి.డి.ఎస్ రైస్ ను పట్టుకున్న పోలీసులు

**హయత్ నగర్ వార్త సంధ్య ప్రతినిధి, ఏప్రిల్ 15:** నిన్న సమాచారం మేరకు పోలీసు వారు పిడిఎస్ రైస్ గురించి రాధా డైరీ ప్రొడక్ట్స్ కిరణం షాపు హుడా సాయి నగర్ నందు రైడ్ చేసి ఏడు క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకోవడం జరిగింది. అట్టి కిరణం షాపు నడుపుతున్న వ్యక్తి యొక్క వివరాలు బిర్దార్ ఉమారావు తండ్రి గణపతి రావు, వయసు 60 సంవత్సరాలు, వృత్తి బిజినెస్, నివాసం కూడా సాయి నగర్ వనస్థలిపురం. ఇతడి పై కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభం చేశారు.

## మహిళా రిజర్వేషన్ లో బీసీ మహిళా వాటా ఏది!

**బిల్లులో సవరణ చేయాల్సిందే**

**- జయంతి గౌడ్ ఆమరణ నిరహార దీక్షలో జై స్వరాజ్ పార్టీ అధినేత కాసాని శ్రీనివాసరావు గౌడ**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి( వార్త సంధ్య) ఏప్రిల్ 15 :** హైదరాబాద్: దేశవ్యాప్తంగా మహిళల రాజకీయ సాధికారతకు కీలకమైన మహిళా రిజర్వేషన్ బిల్లులో సబ్ రిజర్వేషన్ లేకపోవడం తీవ్ర అన్యాయం అని జై స్వరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కాసాని శ్రీనివాసరావు గౌడ మండిపడ్డారు. మహిళలందరికీ సమాన అవకాశాలు కల్పించాలంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రత్యేకంగా సబ్ రిజర్వేషన్ ఇవ్వడం తప్పనిసరి అని ఆయన స్పష్టం చేశారు. మహిళా రిజర్వేషన్ లో బీసీలకు సబ్ కోటా కల్పించాలనే డిమాండ్తో బీసీ మహిళా జేఏసీ చైర్మన్ మట్టా జయంతి గౌడ్ హైదరాబాద్లోని హిమాయత్ నగర్లో ఉన్న తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయం బీసీ భవన్ లో చేస్తున్న ఆమరణ నిరహార దీక్షలో బుధవారం కేఎస్ఆర్ గౌడ పాల్గొని మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ బిల్లు రూపకల్పనలో సామాజిక న్యాయం పూర్తిగా విస్మరించబడింది. ఉన్నత వర్గాలకు మాత్రమే లాభం చేకూరే విధంగా ఈ చట్టాన్ని రూపొందించడం దురుద్దేశపూరిత చర్య" అని తీవ్రంగా విమర్శించారు. "బీసీ మహిళలకు న్యాయం ఎక్కడ? దేశ జనాభాలో భారీ శాతం ఉన్న బీసీ వర్గాలకు చెందిన మహిళలకు రాజకీయాల్లో అవకాశాలు ఇవ్వకపోవడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. ఇది సామాజిక సమానత్వాన్ని దెబ్బతీసే చర్యగా తమ పార్టీ అభిప్రాయపడింది" అని ఆయన అన్నారు. "మహిళా రిజర్వేషన్ బిల్లులో వెంటనే సబ్ రిజర్వేషన్ అమలు చేయాలి

**బీసీ మహిళలకు తగిన శాతం కేటాయింపులు నిర్ధారించాలి**



సామాజిక న్యాయం, సమాన అవకాశాల సూత్రాలను కచ్చితంగా పాటించాలి" అని ఆయన అన్నారు. "ఈ కీలక అంశాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదు. సబ్ రిజర్వేషన్ లేకుండా మహిళా రిజర్వేషన్ బిల్లు అసంపూర్ణండ అన్యాయం!" అని ఆయన గట్టిగా హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేంద్ర గౌడ్, బీసీ మేధావుల పోరం అధ్యక్షుడు చిరంజీవులు, తెలంగాణ రాజకీయ జేఏసీ చైర్మన్ బాల్ రాజ్ గౌడ్, కన్వీనర్ బైరు శేఖర్, తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకుడు పల్లె వినయ్ కుమార్, సూదగాని ఫౌండేషన్ చైర్మన్ సూదగాని హరి శంకర్ గౌడ్, ఆల్ల రామకృష్ణ, విశ్వపతి, చాపర్తి గాడ్గే, పుష్పలీల గౌడ్, రజితా పటేల్, రమా ముదిరాజ్, సాంబ లక్ష్మీ రజక తదితరులు పాల్గొన్నారు.

vaartha sandhya
RNI TGTEL/25/A5065
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు

# సాధించాలనే కసి ఉంటే ఏదైనా సాధ్యం

**విభిన్న ప్రతిభావంతుల విద్యార్థులతో మంత్రి లోకేశ్**

**విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల ఎవరెస్ట్ బేస్ క్యాంప్ యాత్ర**

**ఏపీ సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో ఎవరెస్ట్ బేస్ క్యాంప్ యాత్ర**

**యాత్రను మంగళవారం ప్రారంభించిన మంత్రి లోకేశ్**



పట్టుదల ఉంటే సాధించలేనిది ఏదీ లేదని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల నేపాల్ ఎవరెస్ట్ బేస్ క్యాంప్ అధిరోహణ యాత్ర తనకు ఎంతో ఆసక్తి కలిగిస్తోందన్నారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు అన్ని విధాలా అండగా ఉండి ప్రోత్సహిస్తామని హామీ ఇచ్చారు.

**ఎవరెస్ట్ బేస్ క్యాంప్ యాత్ర :** ప్రభుత్వ ఆధ్వర్యంలో దేశంలోనే మొదటిసారిగా బేస్ క్యాంప్ కార్యక్రమం జరగనుంది. 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న 21 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు ఏప్రిల్ 15 నుంచి 30 వరకు 16 రోజుల పాటు 5,364 మీటర్ల ఎత్తులోని ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌ను అధిరోహించడానికి సిద్ధమవుతున్నారు. ఈ బృందంలో 8 మహిళా విద్యార్థులు ఉన్నారు. జిల్లాల నుంచి ఎంపికైన వీరు తమ సాహసయాత్రతో సవాళ్లను అధిగమించి తమ ప్రతిభను ప్రపంచానికి చూపించేందుకు సిద్ధమయ్యారు. ఈ కార్యక్రమాన్ని ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. ఆయన విద్యార్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. విద్యార్థులను ప్రోత్సహించేందుకు తాను ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**దేవుడు ప్రతి ఒక్కరికి పరీక్ష పెడతాడు :** "దేవుడు ప్రతి కుటుంబానికి ఓ పరీక్ష ఇస్తాడు, ఆ పరీక్షను జయించే శక్తి కూడా ఇస్తాడు" అని మంత్రి లోకేశ్ అన్నారు. సవాళ్లను అధిగమించి ప్రపంచాన్ని జయించాలని విద్యార్థులకు ఆయన దిశానిర్దేశం అందించారు."ఒక పట్టుదల, ఒక కమిట్‌మెంట్ మీకున్నంతగా మాలో ఉండదు. సమాజంలో మీరు ఎదుర్కొన్న పరిస్థితులు అంత సులభం కాదు. చిన్నప్పటి నుంచి అనేక మంది ఎన్నో విధాలుగా మిమ్మల్ని బాధపెట్టారు. కానీ అవన్నీ దాటుకొని ఇక్కడ వరకూ రాగలిగారు అంటే మీలో ఉన్న పట్టుదల, కసి, కమిట్‌మెంట్, ఫైర్ దీనికి ప్రధాన కారణాలు. మీరు మమ్మల్ని కాదు, మేము మిమ్మల్ని చూసి నేర్చుకోవాలి. దేవుడు అందరికీ ఏదో ఒక విధంగా పరీక్ష పెడతాడు. ఆ పరీక్షలను అధిగమించి ముందుకు వెళ్లే శక్తి కూడా ఇస్తాడు. సాధించాలనే కసి ఉంటే ఏదైనా సాధ్యం అవుతుంది. మనందరం ఒక టార్గెట్ పెట్టుకోవాలి. అది సాధించే వరకు నిత్యం దాని గురించే ఆలోచిస్తూ ఉండాలి. నేను మిమ్మలందరినీ కోరేది, మీ జీవితంలో కనీసం పది మందికి సహాయం చేయండి. అది అందరి వల్ల సాధ్యం అవుతుంది. మీరందరూ ఆదర్శంగా నిలబడండి.

**అనుభవాలు పంచుకున్న విద్యార్థులు :** విద్యార్థుల అనుభవాలు ఆకట్టుకున్నాయి. విజ్ఞానపూర్వకంగా తగిన శిక్షణ అందుకున్న జి. విశ్వాస్, సింధు, రూప సాయిశ్రీ లాంటి విద్యార్థులు తమ కష్టాలను, ప్రోత్సాహాన్ని పంచుకున్నారు. "ఎవరెస్ట్ బేస్ క్యాంప్ సెలక్షన్‌లో ఎంపిక కావడం గర్వకారణం" అని రామవరప్పాడు జడ్పీ హైస్కూల్ (విజయవాడ)లో పదో తరగతి చదువుతున్న విశ్వాస్ పేర్కొన్నారు. ఉపాధ్యాయుల మాటలు తనకు ప్రేరణగా నిలిచాయని తిరుపతి జిల్లా చంద్రగిరి న్యూపేట్‌లో ప్రభుత్వ జూనియర్ కాలేజిలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం సింధు, తన కుటుంబ ప్రోత్సాహంతో ఈ సాహసయాత్రకు సిద్ధమయ్యానని కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం గొల్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న రూప సాయిశ్రీ తెలిపారు.

**విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపిన లోకేశ్ :** ఈ కార్యక్రమంలో పాఠశాల విద్య డైరెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా, సమగ్రశిక్ష ఎస్పీడీ బి. శ్రీనివాసరావు, ఏఎస్ పీడీ కె. రవీంద్రనాథ్ రెడ్డి, అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ సీఈవో శేఖర్ బాబు, అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ పర్వతారోహకులు సాయిక్ హిమాన్షు, రఘునాథరెడ్డి, ఎం. పూర్ణ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థుల సాహసయాత్ర విజయవంతం కావాలని మంత్రి నారా లోకేశ్ ఆకాంక్షించి, శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హృదయపూర్వకంగా గ్రూప్ ఫొటోతో ఈ కార్యక్రమాన్ని ముగించారు. ఈ ప్రత్యేకమైన ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులు తమ సామర్థ్యాలను నిరూపించి, సమాజంలో స్ఫూర్తిదాయక స్థానాన్ని అందుకుంటారని భావిద్దాం.

# ఇంట్లో భారీ శబ్దంతో పేలిన డిటోనేటర్లు

**ఐదుగురు మృతి, 11 మంది పరిస్థితి విషమం**

**సత్యసాయి జిల్లాలో ఓ ఇంట్లో భారీ శబ్దంతో పేలిన డిటోనేటర్లు**

**ఈ ఘటనలో ఐదుగురు మృతి చెందగా 21 మందికి తీవ్ర గాయాలు**

**11 మంది పరిస్థితి విషమం**



ఆకాశం విరిగినట్లు ఒక్కసారిగా కుదుపు భారీ శబ్దంతో పేలుడు శ్రీ సత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లిలో ఒక్కసారిగా అలజడి రేగింది. భారీ శబ్దంతో ఓ ఇంట్లో డిటోనేటర్లు పేలాయి. ఈ ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. అరుపులు కేకలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది.సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. కుమ్మరవాండ్లపల్లిలో ఓ ఇంట్లో భారీ శబ్దంతో డిటోనేటర్లు పేలాయి. వాటి తీవ్రతకు ఇల్లు ధ్వంసమైంది. చుట్టుపక్కల నివాసాలు దెబ్బతిన్నాయి. పేలుడు ధాటికి ఆ ప్రాంతంలో ఒక్కసారిగా భీతావహ వాతావరణం ఏర్పడింది. చుట్టుపక్కల వాళ్లు ఏం జరిగిందో తెలుసుకునేలోపే తీవ్ర విషాదం నెలకొంది. రెప్పపాటులోనే కొందరు ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హుటాహుటిన స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

**11 మంది పరిస్థితి విషమం:** ప్రమాదం జరిగిన ఇంట్లో ఉంటున్న వారు డిటోనేటర్లు నిల్వ ఉంచినట్లు స్థానికులు తెలిపారు. అవి పేలడంతోనే భారీ ప్రమాదం జరిగిందన్నారు. నివాసంలోని గ్యాస్ సిలిండర్లకు మంటలు అంటుకొని అవి కూడా పేలాయని దీంతో మంటలు పెద్దఎత్తున ఎగిసిపడ్డాయని తెలిపారు. ఈ దృశ్యాలను చూసి హడలిపోయామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. వీరిలో 11 మంది పరిస్థితి విషమం ఉన్నట్లు వైద్యులు తెలిపారు. మృతుల్లో కుమ్మరవాండ్లపల్లికు చెందిన మహబూన్నీసా, పి.విశ్వనాథ్ రెడ్డి, మధుసూదన్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఒకరు కదిరికి చెందిన అస్లాం బాషాగా తేల్చారు. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా ఫక్రుద్దీన్ ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు.పేలుడు తర్వాత ఘటనా స్థలిని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పరిశీలించారు. తీవ్ర విషాదానికి సంబంధించిన వివరాలను స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. బాధితులను ఓదార్చిన ఎమ్మెల్యే అండగా ఉంటామని భరోసా ఇచ్చారు అనంతరం ఎస్పీ సతీష్‌కుమార్ ఘటనాస్థలిని పరిశీలించారు. ఇంట్లో డిటోనేటర్లు పెట్టుకున్న వారిని పట్టుకుంటామన్నారు. క్షతగాత్రుల పరిస్థితి నిలకడగానే ఉందన్నారు.మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండ: ఈ డిటోనేటర్ల పేలుడు ఘటనపై స్పందించిన మంత్రి అనిత కలెక్టర్, ఎస్పీతో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. డిటోనేటర్లు పేలి ఐదుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని ప్రమాదంలో గాయాలైన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. అలానే పేలుడుపై ఆరా తీసిన మంత్రి సత్యకుమార్ యాదవ్ క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యాధికారులకు ఆదేశించారు. ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

# దేశంలో నక్సలిజం అంతమైంది

**ప్రభావిత జిల్లాలు లేవు**

**కేంద్రం అధికారిక ప్రకటన**

**దేశంలో ఇప్పుడు నక్సల్స్ ప్రభావిత జిల్లా ఏదీ లేదు**

**మార్చి 31 నాటికి దేశం నక్సల్ నుంచి విముక్తి పొందింది**

**ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్‌లో హింస నియంత్రణలోకి వచ్చింది- కేంద్రం**



ఐదు దశాబ్దాలకు పైగా దేశాన్ని పీడించిన నక్సలిజం అంతమైందని కేంద్రం అధికారిక ప్రకటన చేసింది. దేశంలో ఇప్పుడు నక్సల్స్ ప్రభావిత జిల్లా ఏదీ లేదని కేంద్ర హోం శాఖ రాష్ట్రాలకు అధికారికంగా సమాచారం పంపింది. ఈ మేరకు తొమ్మిది రాష్ట్రాలకు లేఖలు రాసిన కేంద్రం, మార్చి 31 నాటికి దేశం నక్సల్ నుంచి విముక్తి పొందిందని పేర్కొంది. గతంలో నక్సల్ ప్రభావిత ప్రాంతాలుగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపుర్, ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాల్లో కూడా ఇప్పుడు హింస నియంత్రణలోకి వచ్చిందని కేంద్రం తెలిపింది.నక్సలిజం పూర్తిగా అంతమైనా, తిరిగి అది పుట్టకుండా ఉండేందుకు కేంద్రం జిల్లాలను రెండు కేటగిరీలుగా వర్గీకరించింది. ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాలతో పాటు మొత్తం 37 లెగసీ అండ్ థ్రస్ట్ జిల్లాలుగా ప్రకటించింది. అక్కడ నక్సలిజం అంతమైనప్పటికీ భద్రతను పటిష్ఠం చేయడానికి అభివృద్ధిని కొనసాగించడానికి ప్రత్యేకంగా పర్యవేక్షణ కొనసాగించనున్నారు. ఝార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లా ఒక్కదాన్ని మాత్రమే డిస్ట్రిక్ట్ ఆఫ్ కన్సర్న్ కేటగిరీలో ఉంచారు. ఇక్కడ నక్సల్స్ వ్యవస్థ చిన్నాభిన్నమైనా, సమీప భవిష్యత్తులో నిరంతర భద్రత అవసరమని పేర్కొన్నారు.

**'నక్సలిజం నిర్మూలన ఒక పెద్ద విజయం'**

అధికారిక గణాంకాల ప్రకారం, నక్సల్ హింసలో ఇప్పటివరకు 17 వేలకుపైగా మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో పౌరులు, భద్రతా సిబ్బంది ఉన్నారు. ఈ నేపథ్యంలో నక్సలిజం నిర్మూలనను ఒక పెద్ద విజయంగా కేంద్రం అభివర్ణిస్తోంది. మరోవైపు, దశాబ్దాలుగా వేళ్లూనుకున్న నక్సలిజం నుంచి దేశానికి విముక్తి కల్పించామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా లోక్‌సభలో పేర్కొన్నారు. సాయుధ తీవ్రవాద ఉద్యమానికి మూలమైన మావోయిస్టు కేంద్ర కమిటీ నిర్మాణాన్ని దాదాపు విచ్ఛిన్నం చేశామన్నారు. 'వామపక్ష తీవ్రవాదం నుంచి దేశం విముక్తికి చర్యలు' అనే అంశంపై ఆయన లోక్‌సభలో షా ప్రసంగించారు.అలాగే, మావోయిస్టుల పొలిట్‌బ్యూరో, కేంద్ర వ్యవస్థను దాదాపు తుడిచిపెట్టేశామని, దీంతో నక్సల్స్ ముప్పు నుంచి దేశం విముక్తి పొందిందని షా ఇదివరకే ప్రకటించారు. మావోయిస్టులకు ఒకప్పుడు కంచుకోటగా ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో నక్సలిజం దాదాపు అంతమైందన్నారు. అదేవిధంగా సమాజంలో అన్యాయాలకు పరిష్కార మార్గాలు రాజ్యాంగంలో ఉన్నాయని, ఆయుధాలు చేపట్టడం సరైన మార్గం కాదని షా చెప్పుకొచ్చారు. హింస ద్వారా కాకుండా చర్చల ద్వారా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని షా పేర్కొన్నారు. ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలిసిన వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రయోజనాలను అందిస్తామన్నారు. పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అయితే, ఆయుధాలు పట్టుకుంటే మాత్రం మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. నక్సలిజాన్ని సమర్థించే వారు ఈ విషయాన్ని తెలుసుకోవాలని షా అన్నారు. అలాగే ఎన్‌డీఏ వచ్చాకే గిరిజనుల జీవితాల్లో మార్పులు వచ్చాయని తెలిపారు. నక్సలిజాన్ని దెబ్బతీసిన ఘనత ప్రధానంగా కేంద్ర, రాష్ట్ర బలగాలకే దక్కుతుందని పేర్కొన్నారు.నక్సలిజాన్ని దేశం నుంచి పూర్తిగా నిర్మూలించాలనే ఉద్దేశంతో మావోయిస్టులపై కేంద్రం కొన్నేళ్లుగా ఉక్కుపాదం మోపుతోంది. ఈ నేపథ్యంలో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రతరం చేసింది. ఆపరేషన్ కగార్ పేరుతో చాలా మంది నక్సలైట్లను మట్టుబెట్టింది. కర్రె గుట్ట వంటి పలు ప్రాంతాల్లో నిరంతర కూంబింగ్‌తో ఆపరేషన్ చేపట్టింది. పోలీసులు కథనాల ప్రకారం, గతేడాది జనవరి నుంచి ఛత్తీస్‌గఢ్‌లో ఆయా ఎన్‌కౌంటర్‌లలో నంబాల కేశవరావు వంటి అగ్ర నేతలతో సహా 500 మందికిపైగా మావోయిస్టులు హతమయ్యారు. అదే విధంగా, రాష్ట్రంలో దాదాపు 1,900 మంది నక్సలైట్లు అరెస్టయ్యారు. మరో 2,500 మందికి పైగా లొంగిపోయారు.

# తీరంలో వేటకు విరామం

**నిషేధం అమలు తర్వాత వేటకు వెళ్తే చర్యలు-రెండు నెలల పాటు**

**మత్స్యకారులను ఆదుకునేలా ప్రభుత్వం భరోసా**



రాష్ట్రంలోని తీరప్రాంతంలో చేపల వేటపై నుంచి నిషేధం అమల్లోకి రానుంది. దీంతో బాపట్ల జిల్లా చీరాల, వేటపాలెం, చినగంజాం,తో పాటు జిల్లాలోని సముద్రతీరంలో వేటను అధికారులు నిషేధించారు. చీరాల మండలం వాడరేవు సముద్రతీరంలో బొట్లు, వలలను మత్స్యకారులు ఒడ్డుకు తీసుకువచ్చి భద్రపరుస్తున్నారు. సముద్ర జీవసంపద పెంపుదల, చేపల సంతానోత్పత్తిని దృష్టిలో ఉంచుకుని ప్రతిఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు మొత్తం 61 రోజుల పాటు ప్రభుత్వం వేట విరామాన్ని ప్రకటిస్తుంది.

**61 రోజుల విరామం:** ఈ కాలంలో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతినకుండా కడలి పుత్రులకు ప్రభుత్వం భారీ ఆర్థిక సాయాన్ని కూడా అందజేస్తోంది. ప్రతి ఏటా వేసవి కాలంలో చేపలు, ఇతర సముద్ర జీవులు సంతానోత్పత్తి చేస్తాయి. ఈ కీలక సమయంలో యాంత్రిక పడవలతో వేట సాగిస్తే మత్స్య సంపద అంతరించిపోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో సముద్ర పర్యావరణాన్ని కాపాడటానికి రాష్ట్ర మత్స్యశాఖ ఈ 61 రోజుల విరామాన్ని తప్పనిసరి చేసింది. ఈ నిబంధనలు రాష్ట్రంలోని అన్ని రకాల మోటారు బోట్లకు వర్తిస్తాయి. కేవలం సంప్రదాయ పడవల ద్వారా తీరానికి సమీపంలో వేట సాగించే వారికి మాత్రమే మినహాయింపు ఉంటుంది.

**నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా కట్టాల్సిందే:** వేట విరామ సమయంలో నిబంధనలు అతిక్రమించి సముద్రంలోకి వెళ్లే వారిపై మత్స్యశాఖ కఠినంగా వ్యవహరించనుంది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి రూ. 5,000 జరిమానా విధించడమే కాకుండా, వారి వలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది. అంతేకాకుండా, సదరు బోటు యొక్క లైసెన్స్, రిజిస్ట్రేషన్‌ను ఏడాది పాటు రద్దు చేస్తారు. తీరప్రాంతాల్లో నిఘా ఉంచేందుకు కోస్ట్ గార్డ్, మెరైన్ పోలీసుల సహకారం తీసుకోనున్నారు. వేట నిషేధ కాలంలో మత్స్యకారులకు కూటమి ప్రభుత్వం భరోసా కలిపిస్తుంది.

**ప్రభుత్వ ఆర్థిక సాయం:** వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలు ఇబ్బంది పడకుండా ఉండేందుకు ప్రభుత్వం 'మత్స్యకార భరోసా' పథకం కింద ప్రతి అర్హత కలిగిన కుటుంబానికి రూ. 20,000 ఆర్థిక సాయం అందజేస్తోంది. గత మూడేళ్ళ క్రితం ఆర్థిక సాయం అందలేదని కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గత ఏడాది మత్స్యకార జీవన భృతి 20 వేలు ఇచ్చారని, ఈ ఏడాది కూడా ఇదే నెలలో భృతి ఇవ్వాలని మత్స్యకారులు కోరుతున్నారు.

# తెలంగాణలో భానుడి భగభగలు

**బయటకు వెళ్తే ఈ జాగ్రత్తలు పాటించడం మేలు**

**తెలంగాణలో మండుతున్న ఎండలు**

**ఉదయం 9 గంటల నుంచే భానుడి భగభగలు**

**బయటకు వెళ్లినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలంటున్న డాక్టర్లు**

**42 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలు**



ఈసారి మార్చి నెల నుంచే ప్రజలు భానుడి ప్రతాపానికి అతలాకుతలం అవుతున్నారు. ఎండలు మండిపోతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది దాటకముందే సూర్యుడు నిప్పుల వర్షం కురిపిస్తున్నాడు. తెలంగాణలో ఇప్పటికే 42 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాబోయే రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. ఈ నేపథ్యంలో సన్‌స్ట్రోక్ నుంచి రక్షించుకోవడం చాలా ముఖ్యం.

**నెత్తిపై నిప్పుల కుంపటి :** మండుతున్న ఎండలు, ఉక్కపోత వాతావరణం ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 42 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న ఎండల తీవ్రతతో పాటు వడగాలులు ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఇప్పటికే పలువురు ప్రాణాలు కోల్పోయారు. ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేదు వార్తనందించింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లోనే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా రానున్న రెండు రోజుల్లో ఎండలు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశం ఉంది. ఎండ వేడి మాత్రమే కాదు ఉపశమనం కోసం తీసుకునే శీతల పానీయాలు కూడా ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

**సన్‌స్ట్రోక్ బీ అలర్ట్ :** వేసవికాలంలో ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎక్కువ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్యలో బయటకు వెళ్లడం ప్రమాదకరమని చెబుతున్నారు. ఈ సమయంలో సన్ స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరిస్తున్నారు. చెమట రాకపోవడం, తీవ్రమైన అలసట, తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సన్ స్ట్రోక్ బ్రెయిన్‌పై ప్రభావం చూపే ప్రమాదం ఉండటంతో నిర్లక్ష్యం చేయొద్దని చెబుతున్నారు. ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. తగిన జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు."వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఉదయం 9-10 గంటలకే విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఆ వేడి ప్రభావం మనకు తెలుస్తోంది. ఇంట్లో నుంచి బయటకు రాగానే అబ్బా ఇంత వేడా అనే భావన వస్తుంది. దీనికోసం కొన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అందరికీ తెలిసిన విషయం హీట్ స్ట్రోక్. సైంటిఫిక్‌గా అనాలసిస్ చేస్తే హాట్ ఎక్సర్షనల్, హీట్ స్ట్రోక్. వీటిని గమనించడం చాలా అవసరం. ఎందుకంటే పిల్లలు, వృద్ధులు తప్పకుండా చూసుకోవాలి. వీటికి బారిన పడినప్పుడు మన శరీరం మనకు చెబుతోంది. ఈ సమ్మర్‌లో లూజ్‌గా ఉండే దుస్తులు వేసుకోవాలి. లైట్ కలర్ ధరించాలి. కాటన్‌వి అయితే మరి మంచిది. ఒకవేళా తప్పనిసరిగా బయటకు వెళ్లాల్సి వస్తే మాత్రం డ్రెస్సింగ్ కాకుండా ఒక టోపి, గొడుగు, వాటర్ బాటిల్‌ను క్యారీ చేయండి. ఎండ బారిన పడకుండా చూసుకోండి"

# తల్లికి ప్రేమను చాటే అద్భుత బహుమతులు మదర్స్ డేకుబెస్ట్ గిఫ్ట్ ఐడియాలు ఇవే



ఈ ప్రపంచంలో తల్లి ప్రేమకు మించింది మనిషికి ఏదీ లేదు. ఏ తల్లి అయినా తన బిడ్డ భవిష్యత్ బాగా ఉండాలని కోరుకుంటుంది. ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల్లో మదర్స్ డే జరగనుంది. ఈ మదర్స్ డే రోజున తమ తల్లులకు మరుపురాని బహుమతులు ఇవ్వాలని చాలా మంది అనుకుంటారు. ఈ నేపథ్యంలో మదర్స్ డే రోజు తల్లులకు గిఫ్ట్ ఇవ్వడానికి బెస్ట్ గిఫ్ట్ ఐడియాల గురించి ఓ సారి తెలుసుకుందాం. అమెరికా, భారతదేశం, కెనడా, యూరప్‌లోని ఎక్కువ భాగంతో సహా అనేక దేశాల్లో మే 11, 2025 ఆదివారం నాడు మదర్స్ డే జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం మే నెలలో రెండో ఆదివారం నాడు మదర్స్ డే జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అయితే ఈ రోజును పురస్కరించుకుని పిల్లలకు తమ తల్లులకు మంచి బహుమతులు ఇస్తూ ఉంటారు. అయితే ఇప్పుడు బడ్జెట్ ఫ్రెండ్లీ బహుమతులతోనే అమ్మను సంతోష పెట్టే బహుమతుల కోసం ఎక్కువగా ఆలోచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ది బెస్ట్ 5 గిఫ్ట్ ఐడియాలపై ఓ లుక్కేద్దాం.

**డిజిటల్ ఫోటో ఫ్రేమ్**

మనకు తల్లితో ఉన్న అనుబంధాన్ని ఇప్పటికే చాలా వరకు ఫోటోల్లో నిక్షిప్తం చేసుకుంటూ ఉంటాం. ఈ అన్ని ఫోటోలను కలిపి డిజిటల్ ఫ్రేమ్‌గా లేదా షేర్డ్ ఆన్‌లైన్ ఆల్బమ్‌గా తయారు చేయండి. భౌతిక ఫోటోల మాదిరిగా కాకుండా ఈ ఆన్‌లైన్ ఆల్బమ్ ఆమెతో గడిపిన సంతోష సమయాన్ని గుర్తు చేస్తూంటుంది.

**పూలుజి**

మీరు మీ తల్లికి దూరంగా ఉంటే ఆమె ఉండే ప్రాంతానికి సమీపంలోని పూల వ్యాపారులు లేదా ఆన్‌లైన్ సేవల ద్వారా అదే రోజు డెలివరీ అయ్యేలా ఆమెకు ఇష్టమైన పూలతో బొకే పంపితే సర్ప్రైజింగ్ గిఫ్ట్‌లా ఉంటుంది. ఇండోర్ ప్లాంట్ లేదా ఆమెకు ఇష్టమైన రంగు పూలను ఇవ్వడం ద్వారా సంతోషపెట్టవచ్చు.

**మొబైల్ ఛార్జింగ్‌కి ఎంత విద్యుత్ ఖర్చు అవుతుందో మీకు తెలుసా..?**

**ఈ-కార్డ్ గిఫ్ట్**

ఆమెకు ఇష్టమైన వస్తువులను అమెజాన్, ఫ్లిప్ కార్ట్ వంటి సైట్స్‌లో ఆర్డర్ చేసి వాటితో పాటు ఈ-గిఫ్ట్ కార్డుతో ఆమె శుభాకాంక్షలు తెలపవచ్చు. లేదా ఆమె ఇష్టమైన భోజన డెలివరీ లేదా దుస్తుల యాప్ కోసం వోచర్‌లను వెంటనే ఈ-మెయిల్ చేయడం ద్వారా ఆమెకు నచ్చిన వస్తువులను కొనుగోలు చేసుకునేలా చేయవచ్చు.

**వీడియో మెసేజ్**

మీ తల్లి మీకు ఎంత స్పెషల్? ఆవిడంటే మీకు ఎంత ఇష్టం అనే విషయాలను చెబుతూ ఓ లెటర్ రాసి ఆమెకు ఇవ్వడంతో పాటు వీడియో సందేశాన్ని ఆమెకు చూపండి. ఎందుకుంటే గిఫ్ట్ షాప్స్‌లో దొరికే లెటర్స్ కంటే స్వ దస్తూరితో రాసిన లెటర్‌ను ఆమెకు అపూరమైనదిగా ఉంటుంది.

**తల్లితో సమయం గడపడం**

మదర్స్ డే రోజు మొత్తం మీ సమయాన్ని మొత్తం ఆమెకే కేటాయించండి. అది ఆమెకు మరుపురాని బహుమతిగా ఉంటుంది. ఆమెతో కలిసి సినిమా చూడటం, వాకింగ్‌కు వెళ్లడం లేదా టీ లేదా కాఫీ తాగుతూ సమయం గడపాలి. ఆమెను పని చేయనివ్వకుండా ఆ రోజు పని మొత్తం మీరే చేయడానికి ప్రయత్నించడం ఉత్తమం.

# రోజుకు ఎంత 'వంట నూనె' వాడాలో తెలుసా

**నిపుణులు ఏమంటున్నారంటే!**

**వంట నూనెను అధికంగా వినియోగిస్తున్న ప్రజలు , తగ్గించకపోతే ప్రమాదం తప్పదట!**



మన వంటకాల్లో నూనె వాడకం ఎక్కువే. బ్రేక్ ఫాస్ట్ మొదలుకుని లంచ్, స్నాక్స్, డిన్నర్‌లో చేసుకునే పదార్థాలకు వంటనూనెను తప్పనిసరిగా వినియోగిస్తున్నాం. అంతేకాదు, శరీర ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో నూనె ప్రధాన పాత్ర పోషిస్తుంది. కానీ, అతిగా నూనె వినియోగిస్తే ఆరోగ్యానికి ఎంత మాత్రమూ మంచిది కాదంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో రోజుకు ఎంత నూనె వాడాలి? అనేది ఇప్పుడు తెలుసుకుందాం!

**ఎంత నూనె వాడాలి :** మారిన జీవనశైలి కారణంగా ఇంట్లో నూనె వాడకం విపరీతంగా పెరిగిపోయిందని గణాంకాలు చెబుతున్నాయి. దేశంలో ఒక్కో మనిషి ఏడాదికి సగటున 23.5 లీటర్ల వంటనూనె వాడుతున్నారని పలు అధ్యయనాల్లో వెల్లడైంది.సిఫార్సుల ప్రకారం మనిషికి రోజుకు 20 మిల్లీ లీటర్లు.. అంటే నాలుగు టేబుల్ స్పూన్లు మించకుండా చూసుకోవాలి. నలుగురు సభ్యులున్న కుటుంబం నెలకు గరిష్ఠంగా 4 లీటర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ మించకూడదు. కనిష్ఠంగా 2.5 లీటర్లకు తగ్గకూడదు.వంటల్లో నూనె వాడకపోవటం సాధ్యం కాదు. చేపలు, కొవ్వులో కరిగే ఎ,డి, ఈ, కె వంటి విటమిన్లను శరీరం గ్రహించుకోవటానికి నూనె అవసరం. శారీరక శ్రమకు కావాల్సిన శక్తిని నూనె అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో వంటల్లో నూనె ఎక్కువగా వాడితే రక్తనాళాలల్లో పూడికలు ఏర్పడే ప్రమాదముందని అంటున్నారు. ఒబెసిటీ, అధిక రక్తపోటు, గుండెజబ్బులకూ దారితీస్తుందట. అందుకే ఆచితూచి లెక్క కట్టి వాడాలి. రోజువారీ వంట నూనె తీసుకోవడం అనేది హృదయ సంబంధ వ్యాధులు, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులతో ముడిపడి ఉంటుంది.

**పదే పదే మరిగిస్తే :** ఒకసారి ఉపయోగించిన నూనెను మళ్లీ మళ్లీ వాడకూడదంటున్నారు నిపుణులు. పొంగుతున్న, రంగు మారిన నూనెను అస్సలు ఉపయోగించవద్దని చెబుతున్నారు. రోడ్డుపక్క బండ్ల వద్ద, హోటల్స్‌లో వాడిన ఆయిల్‌నే మళ్లీ ఉపయోగించడం వల్ల నల్లగా, జిగురుగా తయారవుతుందని పేర్కొంటున్నారు. ఇలాంటి నూనెతో తయారుచేసిన పదార్థాలు తినడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయంటున్నారు.ఒకసారి బాగా వేడిచేసిన నూనెను తర్వాత మళ్లీ వాడుకోవచ్చు. ఆ నూనెను మామూలుగా కూరల్లో వినియోగించడం వల్ల పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ, రెండు నుంచి మూడు సార్లు డీప్ ఫ్రై చేసిన నూనె చిక్కగా తయారవుతుంది. అప్పుడు ఆ నూనె ఎందుకూ పనికిరాదు. ఇలా వాడిన నూనె వాడడం వల్ల క్యాన్సర్స్ లాంటివి వచ్చే అవకాశం ఉంది. - డా. అంజలీ దేవి, పోషకాహార నిపుణులు

**ఏ నూనె మేలు :** కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ : గింజలను ఒత్తిడికి గురిచేసి తీసే(కోల్డ్ ప్రెస్డ్) నూనెకు ఎలాంటి రసాయనాలనూ కలపరని నిపుణులు చెబుతున్నారు. వేడి కూడా చేయరట. సహజ రుచి అలాగే ఉండటంతో పాటు ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లూ ఉంటాయంటున్నారు.

**రిఫైన్డ్ ఆయిల్ :** గింజలను వేడి చేసి, తయారు చేసేవి రిఫైన్డ్ నూనెలు. స్పష్టంగా, ఆకర్షణీయంగా కనిపించటానికి నిల్వ ఉండటానికి రసాయనం కలుపుతారని నిపుణులు చెబుతున్నారు. దీంతో ఒమేగా 3 కొవ్వు ఆమ్లాలు, యాంటీ ఆక్సిడెంట్లు తగ్గిపోతాయని అంటున్నారు. ఈ క్రమంలో రిఫైన్ చేసేటప్పుడు ప్రమాదకర రసాయనాలు తొలగిపోతాయని వివరిస్తున్నారు. ఎలాగంటే, ఫంగస్‌తో కలుషితమైన వేరుశనగ గింజల్లో అఫ్లటాక్సిన్ అనే విష పదార్థం ఉండొచ్చని, ఇది తొలగిపోతుందని పేర్కొంటున్నారు.ఒకదాంట్లో మరో రకం నూనె కలిపి వాడటం మంచిదంటున్నారు నిపుణులు. వేరుశనగ నూనె, కొబ్బరినూనె, ఆవనూనె ఆరోగ్యానికి మేలట. ఇవి నెల నెలా మార్చి వాడుకోవడం లేదా ఒకదానికి ఒకటి కలిపి ఉపయోగించుకోవచ్చని సూచిస్తున్నారు. లేకుంటే, కొంత కోల్డ్ ప్రెస్డ్ నూనెకు నువ్వులు, వేరుశనగ, ఆవ నూనె వంటివి కలిపి వాడుకోవచ్చని తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో రిఫైన్డ్ ఆయిల్ కంటే కోల్డ్ ప్రెస్ ఆయిల్ వినియోగించడం మంచిదని కొన్ని అధ్యయనాల్లో వెల్లడైంది. అంతే కాకుండా నూనె ఎంత వాడాం అనేదాని కంటే నాణ్యత కూడా ముఖ్యమట.కనోలా నూనె, ఆలివ్ నూనె, వేరుశనగ నూనె, సోయాబీన్ నూనె, సన్ ఫ్లవర్ ఆయిల్స్ సాధారణంగా సురక్షితమైనవి.నూనె నుంచి పొగ రావడం మొదలైనా లేదా మంటలు అంటుకున్నా, దానిని ఉపయోగించవద్దు. నూనె దాని స్మోక్ పాయింట్‌కు చేరుకున్న తర్వాత క్షీణించడం మొదలవుతుంది.నూనె దుర్వాసన వస్తే, దాన్ని వాడకుండా పారేయండి. నూనెను ఎక్కువ కాలం నిల్వ ఉంచితే, అది ఆక్సీకరణం చెందవచ్చు లేదా పాడైపోవచ్చు.నూనెను తరచుగా ఉపయోగించకపోతే, చిన్న డబ్బాలలో కొనండి. ఇలా చేయడం వల్ల, గడువు ముగియక ముందే మీరు దానిని ఉపయోగించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. నూనెను చీకటిగా, చల్లగా ఉండే ప్రదేశంలో నిల్వ చేయండి.

# బీట్‌రూట్ జ్యూస్ కాలేయాన్ని డిటాక్స్ చేస్తుందా

**నిపుణులు ఏమంటున్నారో తెలుసా**

**బీట్‌రూట్‌తో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు!**

**మితంగా తీసుకోవాలని సూచన!!**



బీట్‌రూట్.. బెస్ట్ డైట్ అని చెప్పగానే వాటన్నింటిలో ముందు వరసలో కనిపిస్తుంది. ఈ ఐరన్ రిచ్‌ఫుడ్ తక్కువ సమయంలోనే హిమోగ్లోబిన్ శాతాన్నిపెంచడమే కాదు, శరీరానికి కావాల్సిన పోషకాలెన్నో అందిస్తుంది. కెంపు రంగులో మెరిసిపోయే ఈ దుంపతో కలిగే లాభాల్ని దృష్టిలో పెట్టుకునే రోజువారీ ఆహారంలో భాగం చేసుకుంటారు చాలామంది. ఈ క్రమంలో రోజూ బీట్‌రూట్ జ్యూస్ తాగితే కాలేయం డిటాక్స్ అవుతుందా? లాంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!బీట్‌రూట్ జ్యూస్ కాలేయం పనితీరును మెరుగుపరచడంలో, దానిని ఆరోగ్యంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో ఉండే ప్రత్యేకమైన పోషకాలు కాలేయానికి రక్షణ కవచంలా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు, కాలేయంలోని మలినాల్ని బయటకు పంపించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుందని అంటున్నారు.

**యాంటీ ఆక్సిడెంట్లు :** బీట్‌రూట్‌లో 'బీటాలైన్స్' పుష్కలంగా ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్ గుణాలు కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. కాలేయ కణాలను దెబ్బతీసి, వాటి పనితీరుకు ఆటంకం కలిగించే 'ఆక్సిడేటివ్ స్ట్రెస్'ను అడ్డుకోవడంలో ఈ యాంటీ ఆక్సిడెంట్లు కీలక పాత్ర పోషిస్తాయంటున్నారు. అలాగే, బీటాలైన్స్ శరీరంలోని విషతుల్యాలను విచ్ఛిన్నం చేసే ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచి, సహజమైన డీటాక్స్ ప్రక్రియకు తోడ్పడతాయని పేర్కొంటున్నారు. బీట్‌రూట్‌లు కాలేయం, మూత్రపిండాలను శుభ్రపరచడంలో చాలా శక్తివంతంగా పనిచేస్తాయని, ఇది రక్త ప్రసరణ వ్యవస్థను శుద్ధి చేయడంలో సహాయపడుతుంది.

**బెటైన్ :** బీట్‌రూట్‌లో ఉండే 'బెటైన్' అనే సహజ సమ్మేళనం కాలేయాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇది శరీరంలో కొవ్వులు సమర్థవంతంగా వినియోగించుకోవడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇది కాలేయంలో అధికంగా కొవ్వు పేరుకుపోకుండా అడ్డుకోవడం వల్ల ఫ్యాటీ లివర్ వంటి వ్యాధుల బారిన పడకుండా రక్షిస్తుందని అంటున్నారు. అంతేకాకుండా, కాలేయ కణాలను దెబ్బతినకుండా రక్షిస్తుందని తెలియజేస్తున్నారు. బీట్‌రూట్ జ్యూస్‌తో హెపాటిక్ స్టీటోసిస్ గణనీయంగా తగ్గినట్లు పేర్కొంది. పెద్దలలో నాన్-ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ చికిత్సకు బీట్‌రూట్ జ్యూస్ ఒక ప్రభావవంతమైన మార్గమని సూచిస్తుంది.

**యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు :** దీర్ఘకాలిక వాపు కాలేయ దెబ్బతినడానికి కారణమవుతుందంటున్నారు నిపుణులు. బీట్‌రూట్‌లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు కాలేయంలోని వాపును తగ్గించి, దాని ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని చెబుతున్నారు. ఇందులోని బీటాలైన్స్, నైట్రేట్లు వాపును తగ్గించడమే కాకుండా, రక్తప్రసరణను మెరుగుపరుస్తాయని పేర్కొంటున్నారు. దీనివల్ల కాలేయానికి అవసరమైన పోషకాలు అందడంతో పాటు కణాల మరమ్మత్తు ప్రక్రియ వేగవంతం అవుతుందని వివరిస్తున్నారు.

**కాలేయ ఎంజైమ్ పనితీరు :** క్రమం తప్పకుండా బీట్‌రూట్ జ్యూస్ తాగడం వల్ల కాలేయ ఎంజైమ్‌ల పనితీరు మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో రక్తంలో అధిక స్థాయిలో ఉండే ఎంజైమ్‌లు కాలేయ ఒత్తిడికి సంకేతాలంటున్నారు. క్రమం తప్పకుండా బీట్‌రూట్ జ్యూస్ తీసుకోవడం వల్ల ఈ ఎంజైమ్ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయని, తద్వారా కాలేయ పనితీరు మెరుగుపడుతుందని పలు అధ్యయనాల్లో వెల్లడైంది.బీట్‌రూట్ జ్యూస్ కాలేయానికి ఎంతో మేలు చేసినప్పటికీ, దానిని మితంగా తీసుకోవడం మంచిదంటున్నారు నిపుణులు. అతిగా తీసుకోవడం వల్ల బీటూరియా (యూరిన్ గులాబీ లేదా ఎరుపు రంగులోకి మారడం) వంటి దుష్ప్రభావాలు కలగవచ్చని హెచ్చరిస్తున్నారు. బీట్‌రూట్‌లో ఆక్సలేట్లు ఎక్కువగా ఉండటం వల్ల కొంతమందికి కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఉందంటున్నారు. ఒకవేళ ఇప్పటికే కిడ్నీ సమస్యలు ఉంటే, బీట్‌రూట్ రసం తాగే ముందు సంబంధిత డాక్టర్‌ను సంప్రదించడం మంచిదని సూచిస్తున్నారు.

# సింధూరం స్వచ్ఛమైనదో నకిలీదో గుర్తించేదెలా అసలు ఎలా తయారు చేస్తారంటే



కాదేదీ కల్తీకి అనర్హం అన్న సామెతను సార్థకం చేస్తూ దేశంలో అనేక వస్తువులు, నిత్యవసర వస్తువులు, తినే ఆహారం అన్నింటిలోనూ కల్తీకి తెగబడుతున్నారు కొందరు కేటుగాళ్లు. పాలు, పెరుగు, జున్ను, పండ్లు, కూరగాయలు, ఉప్పు, పప్పు, వంటనూనెలు ఇలా ఒక్కటేమిటీ.. ఈ కలికాలంలో ప్రతిదీ కల్తీమయమే. అరటి, మామిడి, బొప్పాయి వంటి పండ్లు, తియ్యటి చక్కెరలో కెమికల్స్, బెల్లం రంగు, రుచి రావడం కోసం కూడా రసాయనాలు వాడుతున్నారు. చివరకు ఆడవాళ్లు నుదుటన ధరించే సింధూరంలోనూ కల్తీ ఉంటుందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మార్కెట్లో నకిలీ సిందూరం దొరుకుతుండటంతో మహిళలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. అసలు, నకిలీ సిందూరాలను ఎలా గుర్తించాలో తెలుసుకుందాం. హనుమంతుడి విగ్రహం ఎప్పుడు సింధూరముతో నిండి వుంటుంది. ముత్తాయిదువులు నుదిటన ధరించే సింధూరం ఎలా తయారు చేస్తారో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే సింధూరం ఒక చెట్టు కాయల నుంచి తయారు చేస్తారు. దీనిని లిపిస్టిక్ ట్రీ అని కూడా అంటారు. సింధూరం చెట్టు కాయలు స్ట్రాబెర్రీకి చాలా దగ్గరగా ఉంటాయి. హనుమంతుడి విగ్రహం ఎప్పుడు సింధూరముతో నిండి వుంటుంది. ముత్తాయిదువులు నుదిటన ధరించే సింధూరం ఎలా తయారు చేస్తారో తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే సింధూరం ఒక చెట్టు కాయల నుంచి తయారు చేస్తారు. దీనిని లిపిస్టిక్ ట్రీ అని కూడా అంటారు. సింధూరం చెట్టు కాయలు స్ట్రాబెర్రీకి చాలా దగ్గరగా ఉంటాయి.

**1 / 5**

ఆయా ప్రాంతాలని బట్టి ఎరుపు, మెరూన్ రంగుల్లో ఈ కాయలు ఉంటాయి. కాయని వలిచి అందులో ఉండే పిక్కల నుండి సింధురాన్ని తీస్తారు. ఆ పిక్కలని ఎండబెట్టి పొడి చేస్తే సింధూరం పొడి తయారవుతుంది. పచ్చి పిక్కలని నలిపితే కూడా చేతికి సింధూరం రంగు అంటుకుంటుందని చెబుతున్నారు. ఇదీ అసలైన సిందూరం. సింధూరం కాయలోని గింజలన్నీ ఒక పాత్రలో చేర్చి కాస్త నీళ్ళు చిలకరించి కలిపితే సింధూరం తయారైనట్టే. ఆయా ప్రాంతాలని బట్టి ఎరుపు, మెరూన్ రంగుల్లో ఈ కాయలు ఉంటాయి. కాయని వలిచి అందులో ఉండే పిక్కల నుండి సింధురాన్ని తీస్తారు. ఆ పిక్కలని ఎండబెట్టి పొడి చేస్తే సింధూరం పొడి తయారవుతుంది. పచ్చి పిక్కలని నలిపితే కూడా చేతికి సింధూరం రంగు అంటుకుంటుందని చెబుతున్నారు. ఇదీ అసలైన సిందూరం. సింధూరం కాయలోని గింజలన్నీ ఒక పాత్రలో చేర్చి కాస్త నీళ్ళు చిలకరించి కలిపితే సింధూరం తయారైనట్టే.

**2 / 5**

ఇకపోతే, ఈ సింధూరం చెట్టు ఆకులు తమలపాకు కి దగ్గరగా ఉంటాయట. తెల్లటి పూలు పూస్తాయి. గుత్తులు గుత్తులగా కాయలు కాస్తాయి. కాయలు విచ్చుకుంటాయి. ఎంత జాగ్రత్తగా విచ్చుకుంటుందంటే.. కాయలోని సగం డిప్ప మూత తెరిచినట్టుగా పైకి లేస్తుంది. కానీ, ఒక్క గింజ కూడా కిందపడదు. ఇకపోతే, ఈ సింధూరం చెట్టు ఆకులు తమలపాకు కి దగ్గరగా ఉంటాయట. తెల్లటి పూలు పూస్తాయి. గుత్తులు గుత్తులగా కాయలు కాస్తాయి. కాయలు విచ్చుకుంటాయి. ఎంత జాగ్రత్తగా విచ్చుకుంటుందంటే.. కాయలోని సగం డిప్ప మూత తెరిచినట్టుగా పైకి లేస్తుంది. కానీ, ఒక్క గింజ కూడా కిందపడదు.

**3 / 5**

అసలు సిందూరం చెట్టు నుండి తయారవుతుంది. నకిలీ సిందూరం లెడ్, సింథటిక్ రంగులతో తయారవుతుంది. గుర్తించడానికి కాస్త సిందూరాన్ని తీసుకుని చేతిపై వేసుకుని బాగా రుద్ది ఊదండి.. అప్పుడు అది ఎగిరిపోతే అసలు, చేతికి అంటుకుంటే నకిలీ అని గుర్తుపెట్టుకోండి. సింథటిక్ రంగుల వల్ల నకిలీ సిందూరం చేతికి అంటుకుంటుంది. అసలు సిందూరం చెట్టు నుండి తయారవుతుంది. నకిలీ సిందూరం లెడ్, సింథటిక్ రంగులతో తయారవుతుంది. గుర్తించడానికి కాస్త సిందూరాన్ని తీసుకుని చేతిపై వేసుకుని బాగా రుద్ది ఊదండి.. అప్పుడు అది ఎగిరిపోతే అసలు, చేతికి అంటుకుంటే నకిలీ అని గుర్తుపెట్టుకోండి. సింథటిక్ రంగుల వల్ల నకిలీ సిందూరం చేతికి అంటుకుంటుంది.

**4 / 5**

సున్నం, సింథటిక్ రంగులు, గాజు ముక్కలతో నకిలీ సిందూరం తయారవుతుంది. అసలు సిందూరం మొక్కల నుండి సేకరించిన విత్తనాలతో తయారవుతుంది. నెత్తిన చిటికెడు సిందూరం కూడా అనారోగ్యాలకు దారితీయవచ్చు. సిందూర తయారీలో వాడే కెమికల్స్ జుట్టు రాలడానికి కారణం కావచ్చు. సున్నం, సింథటిక్ రంగులు, గాజు ముక్కలతో నకిలీ సిందూరం తయారవుతుంది. అసలు సిందూరం మొక్కల నుండి సేకరించిన విత్తనాలతో తయారవుతుంది. నెత్తిన చిటికెడు సిందూరం కూడా అనారోగ్యాలకు దారితీయవచ్చు. సిందూర తయారీలో వాడే కెమికల్స్ జుట్టు రాలడానికి కారణం కావచ్చు.



# ఉదయం నిద్రలేవగానే గ్లాసుడు గోరువెచ్చని నీళ్లు తాగితే మీ లైఫ్‌లో సరికొత్త చాప్టర్ మొదలైనట్లే



గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల మన ఆరోగ్యంలో అనేక మార్పులు వస్తాయట. ఆయుర్వేదం నుంచి సైన్స్ వరకు ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు త్రాగడం ప్రయోజనకరమని చెబుతుంది. కాబట్టి ఉదయం నిద్రలేచిన తర్వాత గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరంపై ఎలాంటి ప్రభావాలు ఉంటాయో ఇక్కడ తెలుసుకుందాం..

**ఉదయం గోరువెచ్చని నీరు త్రాగడం వల్ల కలిగే ప్రయోజనాలు ఇవే..**

చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, ఆరోగ్య నిపుణులు ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగాలని పదేపదే చెబుతుంటారు. నిజంగా.. దీన్ని సీరియస్‌గా తీసుకునే వారు ప్రతి రోజూ ఈ అలవాటును అనుసరిస్తుంటారు. కానీ చేయలేని వారు అంతే స్థాయిలో నష్టపోతారు కూడా. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఎంత మంచిదో మీకు తెలుసా..? ఉదయం నిద్ర లేవగానే గోరువెచ్చని నీరు తాగడం ఓ మంచి అలవాటు. అందుకే చిన్నతనం నుంచి తల్లిదండ్రులు, ఆరోగ్య నిపుణులు ఈ విషయాన్ని పదేపదే చెబుతుంటారు. దీన్ని సీరియస్‌గా తీసుకునే వారు ప్రతి రోజూ ఈ అలవాటును అనుసరిస్తుంటారు. కానీ చేయలేని వారు అంతే స్థాయిలో నష్టపోతారు కూడా. అయితే ఈ అలవాటు మన ఆరోగ్యానికి ఎంత మంచిదో మీకు తెలుసా..? అవును. ఉదయం

**జీర్ణవ్యవస్థ బాగుంటుంది**

ఉదయం పూట నిద్ర లేచిన వెంటనే గోరువెచ్చని నీరు తాగడం వల్ల జీర్ణవ్యవస్థకు చాలా మేలు జరుగుతుంది. ఇది కడుపులో గ్యాస్, అజీర్ణం, ఆమ్లత్వం వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగించి కడుపు తేలికగా అనిపించేలా చేస్తుంది. ఇది పేగు కండరాలను కూడా సడలిస్తుంది.

**విషాన్ని తొలగిస్తుంది**

ప్రతి ఉదయం ఖాళీ కడుపుతో గోరువెచ్చని నీరు తాగడం వల్ల శరీరం పూర్తిగా నిర్విషీకరణ చెందుతుంది. ఈ నీరు శరీరం నుంచి విషాన్ని బయటకు పంపి, శరీరాన్ని లోపలి నుంచి శుద్ధి చేసి, చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. కొంతమంది నిమ్మకాయ, తేనె కలిపి తాగుతారు. ఇది నిర్విషీకరణ ప్రక్రియకు మరింత సహాయపడుతుంది.

**ఏపీ పీజీసెట్ 2025 దరఖాస్తు గడువు పెరిగిందోచ్..**

**ఎప్పటి వరకంటే?**

**జీవక్రియను పెంచుతుంది**

మీరు బరువు తగ్గాలనుకుంటే ఉదయం గోరువెచ్చని నీరు తాగడం మంచిది. ఇది శరీర జీవక్రియను పెంచుతుంది. కాబట్టి, కేలరీలు వేగంగా కరుగుతాయి. ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల రోజంతా శక్తి లభిస్తుందని వైద్యులు అంటున్నారు. శరీరం చురుగ్గా ఉంటుంది కూడా.

**రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది**

ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల రక్త ప్రసరణ కూడా మెరుగుపడుతుంది. అదనంగా ఇది గుండె ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతుంది. ఇది కండరాలపై ఒత్తిడిని కూడా తగ్గిస్తుంది.

**చర్మ కాంతి పెరుగుతుంది**

ఉదయం గోరువెచ్చని నీరు తాగడం వల్ల చర్మం కాంతివంతంగా మారుతుంది. శరీరాన్ని లోపలి నుంచి శుభ్రపరిచి మేలు చేస్తుంది. దాని ప్రభావాలు చర్మంపై కూడా కనిపిస్తాయి. అంతేకాకుండా గోరువెచ్చని నీరు చర్మాన్ని హైడ్రేట్ చేస్తుంది. మొటిమలు, ముడతలను తగ్గించి చర్మాన్ని ప్రకాశవంతంగా మారుస్తుంది. చర్మ సంబంధిత సమస్యలతో బాధపడేవారు రోజూ ఉదయాన్నే గోరువెచ్చని నీరు తాగడం ప్రయోజనకరంగా ఉంటుంది.

**గమనిక:**

ఈ కంటెంట్ సాధారణ సమాచారం కోసం మాత్రమే. మరింత సమాచారం కోసం ఎల్లప్పుడూ వైద్యుడిని సంప్రదించడం మర్చిపోవద్దు.

# అమెరికా ఇరాన్ చర్చల తర్వాత పెరిగిన బంగారం ధరలు

బంగారం ధరలు, వెండి ధరలు భారత మార్కెట్లు మూసి ఉన్నందున, గ్లోబల్ ట్రెండ్స్‌పై ఆధారపడి కదలనున్నాయి. ఏప్రిల్ 14న ఎంసీఎక్స్‌లో బంగారం, వెండితో సహా కమోడిటీల ట్రేడింగ్ సగం రోజు నిలిచిపోనుంది. మరోవైపు, స్పాట్ గోల్డ్ ధర గత నష్టాల నుంచి కోలుకుని, ఔన్సుకు 4,760 డాలర్ల పైకి చేరింది. అదే సమయంలో, స్పాట్ సిల్వర్ ధర దాదాపు 2% పెరిగి, ఔన్సుకు 77 డాలర్ల సమీపంలో ట్రేడ్ అవుతోంది.ముడి చమురు ధరలు తగ్గుతున్నప్పటికీ, ఈ విలువైన లోహాల ధరలు పెరగడం గమనార్హం. యూఎస్ డబ్ల్యూటీఐ, బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 98 డాలర్ల వద్ద కష్టపడుతున్నాయి. చమురు ధరలు 2% మేర తగ్గాయి.ప్రస్తుతం అమల్లో ఉన్న రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం ముగియకముందే, దీర్ఘకాలిక శాంతి కోసం చర్చలు పునఃప్రారంభించడానికి అమెరికా, ఇరాన్ సుముఖత చూపడంతోనే బంగారం, వెండి ధరలు పెరిగాయి. హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ చమురు రవాణాపై అమెరికా నౌకా దిగ్బంధనం ప్రారంభించిన కొన్ని గంటలకే, టెహ్రాన్ తమను సంప్రదించిందని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. అంతర్జాతీయ చట్టాలు, నిబంధనల పరిధిలో శాంతి చర్చలను కొనసాగించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కూడా సూచించినట్లు ట్రేడింగ్ ఎకనామిక్స్ పేర్కొంది.గోల్డ్ రేట్స్ లైవ్ అప్‌డేట్స్: ,800 మార్కును దాటిన బంగారం ధరలుఅంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలు మంగళవారం పరుగులు తీశాయి. ఔన్సు బంగారం ధర ,800 మార్కును దాటింది. మార్చి 18 తర్వాత ఈ స్థాయికి చేరడం ఇదే మొదటిసారి. అమెరికా-ఇరాన్ మధ్య చర్చల్లో పురోగతి కనిపిస్తుండటంతో డాలర్ విలువ తగ్గడం, ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 0 దిగువకు పడిపోవడంతో ద్రవ్యోల్బణం ఆందోళనలు కాస్త తగ్గాయి. వారాంతంలో జరిగిన చర్చల్లో ఎటువంటి ఒప్పందం కుదరకపోయినా, హార్ముజ్ జలసంధి దిగ్బంధం అమల్లోకి వచ్చినప్పటికీ.. రెండు వారాల కాల్పుల విరమణ గడువు ముగిసేలోపు మరిన్ని చర్చలు జరపాలని అమెరికా అధికారులు భావిస్తున్నట్లు ట్రేడింగ్ ఎకనామిక్స్ పేర్కొంది.వెండి ధరల లైవ్ అప్‌డేట్స్: భారీగా పెరిగిన వెండి.. మార్కుకు చేరువలో స్పాట్ సిల్వర్!అంతర్జాతీయ మార్కెట్‌లో వెండి ధరలు ఒక్కసారిగా పెరిగాయి. స్పాట్ సిల్వర్ ధర కనీసం 5 శాతం మేర పెరిగి, ప్రస్తుతం ఔన్సు వెండి వద్ద ట్రేడవుతోంది. మార్చి మధ్య కాలం తర్వాత వెండి ఈ స్థాయికి చేరడం ఇదే తొలిసారి. అమెరికా-ఇరాన్ మధ్య చర్చల్లో పురోగతి కనిపిస్తుండటంతో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు కంటే కిందకు పడిపోయాయి. మరోవైపు డాలర్ విలువ కూడా ఒత్తిడికి లోనవడంతో వెండి ధరలకు రెక్కలొచ్చాయి.కమోడిటీ మార్కెట్ లైవ్: భారీగా పతనమైన ముడి చమురు ధరలుఅంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు కుప్పకూలాయి. యూఎస్ డబ్ల్యూటీఐ క్రూడ్ ధర దాదాపు 6 శాతం క్షీణించి, బ్యారెల్‌కు 94 డాలర్ల దిగువకు పడిపోయింది. మరోవైపు బ్రెంట్ క్రూడ్ కూడా సుమారు 4 శాతం మేర తగ్గి, ప్రస్తుతం 95 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.కమోడిటీ మార్కెట్ లైవ్: క్రూడాయిల్ ధరలు ఎందుకు తగ్గుతున్నాయి? తాజా అప్‌డేట్స్ ఇవే..రెండు వారాల కాల్పుల విరమణ గడువు ముగిసేలోపు మరో రౌండ్ చర్చలు జరిపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ చర్చలు పాకిస్థాన్‌లో జరిగే అవకాశం ఉందని నివేదికలు చెబుతున్నాయి. వారాంతంలో జరిగిన చర్చలు ఫలించకపోవడంతో, ఇరాన్ చమురు రవాణాపై ట్రంప్ ఆంక్షలు విధించారు. అయితే, ఈ ఆంక్షలను ఎత్తివేసి దౌత్య మార్గాల్లో సమస్యను పరిష్కరించుకోవాలని సౌదీ అరేబియా అమెరికాను కోరింది. మరోవైపు, ఈ ఉద్రిక్తతల కారణంగా ఈ ఏడాది ప్రపంచ చమురు డిమాండ్ వృద్ధి పూర్తిగా పడిపోయే అవకాశం ఉందని ఐఈఏ హెచ్చరించింది. కరోనా మహమ్మారి తర్వాత ఇలాంటి వార్షిక క్షీణత నమోదు కావడం ఇదే తొలిసారి. ప్రస్తుత మార్కెట్ ధరలు ఇంకా ఈ సంక్షోభ తీవ్రతను పూర్తిగా ప్రతిబింబించడం లేదని ట్రేడింగ్ ఎకనామిక్స్ వెల్లడించింది.దేశంలో బంగారం ధరలు భారీగా పెరిగాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,470 పెరిగి రూ. 1,53,930కి చేరగా.. 100 గ్రాముల ధర రూ. 14,700 ఎగబాకి రూ. 15,39,000 వద్ద కొనసాగుతోంది. అలాగే 8 గ్రాముల బంగారంపై రూ. 1,176 పెరగడంతో రూ. 1,23,144కి, ఒక గ్రాము ధర రూ. 147 పెరిగి రూ. 15,393కి చేరుకుంది.నేటి బంగారం ధరలు: దేశంలో 22 క్యారెట్ల గోల్డ్ రేట్లు ఇవే!దేశీయంగా 22 క్యారెట్ల బంగారం ధరలు భారీగా పెరిగాయి. 10 గ్రాముల బంగారంపై




రూ. 1,350 పెరగడంతో ధర రూ. 1,41,100కి చేరింది. 100 గ్రాముల బంగారం ధర రూ. 13,500 మేర ఎగబాకి రూ. 14,11,000 వద్ద కొనసాగుతోంది. ఇక 8 గ్రాముల బంగారం ధర రూ. 1,080 పెరిగి రూ. 1,12,880కి, ఒక గ్రాము ధర రూ. 135 పెరిగి రూ. 14,110కి చేరుకుంది.18 క్యారెట్ల బంగారం ధరలు భారీగా పెరిగాయి. 10 గ్రాముల బంగారంపై రూ. 1,110 పెరగడంతో ధర రూ. 1,15,450కి చేరింది. 100 గ్రాముల బంగారం ధర రూ. 11,100 ఎగబాకి రూ. 11,54,500 వద్ద కొనసాగుతోంది. ఇక 8 గ్రాముల బంగారం ధర రూ. 888 పెరిగి రూ. 92,360కి చేరగా, ఒక గ్రాము బంగారం ధర రూ. 111 పెరిగి రూ. 11,545 వద్ద ఉంది.కమోడిటీ మార్కెట్ లైవ్ అప్‌డేట్స్: ఒత్తిడిలో అమెరికా డాలర్మంగళవారం డాలర్ ఇండెక్స్ 98.3 వద్ద స్థిరంగా కొనసాగుతూ ఆరు వారాల కనిష్ట స్థాయికి పడిపోయింది. అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందన్న ఆశాభావంతో ఇన్వెస్టర్లు రిస్క్ ఉన్న అసెట్స్ వైపు మళ్లుతున్నారు. వారాంతంలో ఇరాన్‌తో ఒప్పందం కుదరకపోవడంతో, ఆ దేశ చమురు రవాణాపై ఆంక్షలు విధిస్తున్నట్లు అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. అయితే, ఆ తర్వాత ఇరాన్ తమను సంప్రదించిందని, మళ్లీ చర్చలు ప్రారంభించేందుకు ఆసక్తి చూపుతోందని ట్రంప్ సంకేతాలిచ్చినట్లు ట్రేడింగ్ ఎకనామిక్స్ పేర్కొంది.నేటి బంగారం, వెండి ధరలు లైవ్: వీజళ గోల్డ్, సిల్వర్ మార్కెట్ అప్‌డేట్స్నిన్న వీజళ మార్కెట్‌లో బంగారం, వెండి ధరల్లో ప్రాఫిట్ బుకింగ్ కనిపించింది. హార్ముజ్ జలసంధి భద్రత కోసం అమెరికా తన దళాలను మోహరించే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ఈ మార్పులు చోటుచేసుకున్నాయని ాఖూ సెక్యూరిటీస్ రీసెర్చ్ అనలిస్ట్ జతీన్ త్రివేది తెలిపారు. దీనివల్ల సరఫరాకు ఆటంకం కలిగి ముడి చమురు ధరలు పెరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రారంభంలో ధరలు తగ్గినప్పటికీ, ఆ తర్వాత మళ్లీ పుంజుకుని 00 మార్కును దాటాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా మార్కెట్‌లో ఒడిదుడుకులు కొనసాగుతున్నాయి. రాబోయే రోజుల్లో బంగారం ధర 1,48,500 నుంచి 1,52,500 మధ్య ట్రేడ్ అయ్యే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.నేటి బంగారం, వెండి ధరలు: సాయంత్రమే ప్రారంభం కానున్న వీజళ మార్కెట్పండుగల నేపథ్యంలో మల్టీ కమోడిటీ ఎక్స్చేంజ్ (వీజళ) మార్కెట్‌కు నేడు సగం రోజు సెలవు ప్రకటించారు. ఏప్రిల్ 14న ఉదయం 9:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:45 గంటల వరకు జరిగే డే సెషన్ అందుబాటులో ఉండదు. ఈ సమయంలో బంగారం, వెండి వంటి విలువైన లోహాలతో పాటు క్రూడ్ ఆయిల్, నేచురల్ గ్యాస్, ఇతర మెటల్స్ ట్రేడింగ్ నిలిచిపోతుంది. అయితే, సాయంత్రం 5:30 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈవినింగ్ సెషన్ యథావిధిగా కొనసాగుతుంది.

# ఫాస్టాగ్ వాడుతున్నారా




భారతదేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక సమాచారాన్ని అందించింది. ఏప్రిల్ 1, 2026 నుండి దేశంలోని అన్ని టోల్ ప్లాజాలు పూర్తిగా డిజిటల్ మయం కానున్నాయి. అంటే, ఇకపై టోల్ గేట్ల వద్ద నగదు రూపంలో ఫీజు చెల్లించే సదుపాయం ఉండదు. కేవలం ఫాస్టాగ్ ద్వారా మాత్రమే చెల్లింపులు చేయాల్సి ఉంటుంది.నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా టోల్ వసూలు ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి , పారదర్శకతను పెంచడానికి ఈ నిర్ణయం తీసుకుంది. టోల్ ప్లాజాల వద్ద వాహనాలు గంటల తరబడి క్యూలో నిలబడటం వల్ల ఇంధనం వృథా అవ్వడమే కాకుండా, కాలుష్యం కూడా పెరుగుతోంది. ఈ కొత్త డిజిటల్ సిస్టమ్ వల్ల వాహనాలు త్వరగా టోల్ గేట్లను దాటే అవకాశం ఉంటుంది, తద్వారా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది.నగదు లేకపోతే పరిస్థితి ఏంటి ఇప్పటివరకు టోల్ ప్లాజాల వద్ద కనీసం ఒక 'క్యాష్ లేన్' అందుబాటులో ఉండేది. కానీ ఏప్రిల్ 1 నుండి ఆ లేన్‌ను కూడా తొలగించనున్నారు. ఒకవేళ మీ వాహనానికి ఫాస్టాగ్ లేకపోయినా లేదా అందులో బ్యాలెన్స్ లేకపోయినా, మీరు అక్కడ ఉన్నౖు= కోడ్ ను స్కాన్ చేసి యూపీఐ ద్వారా వెంటనే పేమెంట్ చేయాల్సి ఉంటుంది. అయితే, కొన్ని ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యల వల్ల యూపీఐ పేమెంట్స్ ఫెయిల్ అయ్యే అవకాశం ఉంది. అటువంటి సమయాల్లో వాహనదారులకు జరిమానా విధించడమే కాకుండా, టోల్ దాటడానికి అనుమతి నిరాకరించే అవకాశం కూడా ఉంది.ఫాస్టాగ్ వాడేవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలుప్రయాణానికి ముందే మీ ఫాస్టాగ్ వాలెట్ లో తగినంత బ్యాలెన్స్ ఉందో లేదో సరిచూసుకోవాలి. ఎన్‌హెచ్‌ఏఐ నిబంధనల ప్రకారం, 'బ్లాక్ లిస్ట్' లో ఉన్న లేదా ఇనాక్టివ్ గా ఉన్న ఫాస్టాగ్‌లతో టోల్ ప్లాజాలోకి ప్రవేశిస్తే రెట్టింపు టోల్ ఫీజును జరిమానాగా చెల్లించాల్సి ఉంటుంది. కాబట్టి, మీ ఫాస్టాగ్ కేవైసీ పూర్తి అయ్యిందో లేదో ముందే చెక్ చేసుకోవడం ఉత్తమం.స్మార్ట్ ట్రావెల్ కోసం టిప్స్ఆటో టాప్ - అప్: మీ ఫాస్టాగ్ ను బ్యాంక్ అకౌంట్‌తో లింక్ చేసి ఆటో టాప్ - అప్ ఆప్షన్ ఎంచుకోండి. దీనివల్ల బ్యాలెన్స్ అయిపోతుందనే భయం ఉండదు.యూపీఐ బ్యాకప్: అత్యవసర సమయాల్లో వాడుకోవడానికి మీ ఫోన్‌లో ఫోన్‌పే, జీపే లేదా భీమ్ వంటి యూపీఐ యాప్స్‌ను సిద్ధంగా ఉంచుకోండి.మై ఫాస్టాగ్ యాప్: మీ టోల్ లావాదేవీలను ట్రాక్ చేయడానికి ఎప్పటికప్పుడు యాప్‌ను తనిఖీ చేస్తూ ఉండండి.డిజిటల్ చెల్లింపుల వైపు సాగుతున్న ఈ ప్రయాణం వల్ల హైవేలపై ట్రాఫిక్ జామ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. కాబట్టి, ప్రయాణీకులు ఇబ్బంది పడకుండా ముందే తమ వాహనాలకు యాక్టివ్ ఫాస్టాగ్ ఉండేలా చూసుకోవాలి.

# ఒకప్పుడు మ్యాగీ తింటూ గడిపాడు!




## నేడు నెలకు రూ. 3.5 లక్షల సంపాదిస్తున్నాడు!

ప్రస్తుతం కార్పొరేట్ ప్రపంచంలో ఎక్కడ చూసినా లేఆఫ్స్ వార్తలే వినిపిస్తున్నాయి. ఎప్పుడు ఎవరి ఉద్యోగం ఊడుతుందో తెలియని పరిస్థితి. ఇలాంటి సమయంలో అందరూ 'స్టేబుల్' జాబ్ కోసం వెతుకుతుంటే, ఒక యువకుడు మాత్రం దానికి పూర్తి భిన్నంగా ఆలోచించి అద్భుత విజయాన్ని అందుకున్నాడు. ఇది బెంగళూరుకు చెందిన టెక్కాస్ టెక్నాలజీస్ ఫౌండర్ ఇమాన్యుయెల్ జాన్ సక్సెస్ స్టోరీ ఇది కేవలం సక్సెస్ స్టోరీ మాత్రమే కాదు, కెరీర్ ప్రారంభంలో రిస్క్ ఎలా చేయాలో నేర్పే ఒక పాఠం.సుఖం కంటే నేర్చుకోవడమే మిన్న!కెరీర్ మొదట్లో ఎవరికైనా నెలకు రూ. 25,000 జీతం అంటే మంచి ఆఫర్ కిందే లెక్క. కానీ, ఈ యువకుడు ఆ ఆఫర్‌ను ధైర్యంగా తిరస్కరించాడు. కారణం? అక్కడ పని నేర్చుకునే అవకాశం తక్కువని భావించడమే. కేవలం రూ. 10,000 వచ్చే ఇంటర్న్‌షిప్‌ను ఎంచుకున్నాడు. ఆ తక్కువ డబ్బుతో బెంగళూరు లాంటి నగరంలో ఉండటం అంటే మామూలు విషయం కాదు. ఒక చిన్న రూమ్‌లో ఉంటూ, చాలా రోజులు కేవలం మ్యాగీ తింటూ ఆకలి తీర్చుకున్నాడు. కానీ, ఆ కష్టం వెనుక ఉన్నది 'లెర్నింగ్' మీద ఉన్న తపన మాత్రమే.లేఆఫ్స్ కాలంలో స్కిల్స్ - అసలైన ఆయుధంచాలామంది ఉద్యోగులు జీతం పెరుగుదల కోసం చూస్తారు తప్ప, తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడంలో వెనుకబడతారు. కానీ, ఈ ఫౌండర్ మాత్రం ట్రెండింగ్‌లో ఉన్న టెక్నాలజీలపై పట్టు సాధించాడు. స్టార్టప్ వాతావరణంలో పనిచేస్తూ ఒకేసారి మల్టిపుల్ రోల్స్ ఎలా హ్యాండిల్ చేయాలో నేర్చుకున్నాడు. ఈ క్రమంలోనే బ్లాక్‌చైన్ టెక్నాలజీ వంటి రంగాల్లోకి అడుగుపెట్టి, తన ఆదాయాన్ని నెలకు రూ. 3.5 లక్షలకు పెంచుకోగలిగాడు. కంపెనీలు లేఆఫ్స్ ప్రకటిస్తున్నప్పుడు, కేవలం స్కిల్స్ ఉన్నవారికి మాత్రమే డిమాండ్ ఉంటుందని ఆయన నిరూపించాడు.సొంత సామ్రాజ్యం దిశగా..ఒక స్థాయికి చేరుకున్నాక, తను నేర్చుకున్న పాఠాలతో సొంత కంపెనీని ప్రారంభించాడు. తన ప్రయాణంలో ఎదురైన ఓటములను, తప్పులను కూడా సోషల్ మీడియాలో ఓపెన్‌గా పంచుకోవడంతో నెటిజన్ల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా కెరీర్ గందరగోళంలో ఉన్న యువతకు ఆయన సలహాలు బాగా ఉపయోగపడుతున్నాయి.ఆయన ప్రయాణం నేర్పే పాఠాలు..నేర్చుకోవడానికే ప్రాధాన్యత: కెరీర్ మొదట్లో జీతం కంటే పని నేర్చుకోవడం మీద దృష్టి పెట్టాలి.స్కిల్ బిల్డింగ్: ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ కంటే స్కిల్స్ పెంచుకోవడం వల్ల భవిష్యత్తులో అది కాంపౌండింగ్ ఎఫెక్ట్‌తో ఎక్కువ లాభాన్ని ఇస్తుంది.రిస్క్ చేయక తప్పదు: సేఫ్ జోన్‌లో ఉంటే ఎదుగుదల తక్కువగా ఉంటుంది; కాలిక్యులేటెడ్ రిస్క్ తీసుకోవడం అవసరం.తక్కువలో జీవించడం: లక్ష్యం కోసం కొన్ని రోజులు అసౌకర్యాన్ని భరించినా తప్పు లేదు.మొత్తంగా చూస్తే.. నేటి మార్కెట్ పరిస్థితుల్లో ఏ ఉద్యోగమూ వంద శాతం గ్యారెంటీ కాదు. పెద్ద పెద్ద కంపెనీలు సైతం లేఆఫ్స్ పేరుతో ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో మనం నేర్చుకున్న విద్య, సంపాదించిన నైపుణ్యమే మనల్ని కాపాడతాయి. ఈ బెంగళూరు ఫౌండర్ సక్సెస్ స్టోరీ మనకు చెప్పేది ఒక్కటే.. మనం చేసే పనిలో ప్రావీణ్యం ఉంటే, ఈరోజు మ్యాగీ తిన్నా రేపు లక్షల ఆదాయం సంపాదించడం అసాధ్యమేమీ కాదు!

# ఇరాన్ యుద్ధంలో కొత్త మలుపు

## సైబర్ దాడులను మొదలు పెట్టిన టెహ్రాన్.. బలయిన అమెజాన్..





అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు ఇప్పుడు డిజిటల్ యుద్ధ క్షేత్రానికి మళ్లాయి. బహ్రెయిన్‌లోని ప్రముఖ టెలికాం సంస్థ లక్ష్యంగా ఇరాన్ చేసిన సైబరాబాద్ దాడి అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టిస్తోంది.ఇరాన్ మద్దతు ఉన్న సైబర్ గ్రూపులు బహ్రెయిన్‌కు చెందిన అగ్రశ్రేణి టెలికమ్యూనికేషన్ కంపెనీపై దాడి చేశాయి.ఈ కంపెనీ కేవలం బహ్రెయిన్‌కే పరిమితం కాకుండా, అమెరికాకు చెందిన టెక్ దిగ్గజం 'అమెజాన్ వెబ్ సర్వీసెస్' కు ఆతిథ్యం ఇస్తుండటం గమనార్హం. అమెరికాకు చెందిన ఒక ప్రముఖ టెక్ కంపెనీ మౌలిక సదుపాయాలపై ఇరాన్ నేరుగా చేసిన మొదటి సైబర్ దాడిగా దీనిని నిపుణులు అభివర్ణిస్తున్నారు. ఈ దాడి కారణంగా బహ్రెయిన్‌లోని డిజిటల్ నెట్‌వర్క్‌లు, అమెజాన్ సర్వీసులకు అంతరాయం కలిగింది.గత కొన్ని వారాలుగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామని హెచ్చరిస్తున్న తరుణంలో, ఈ సైబర్ దాడితో తన ప్రతీకారాన్ని తీర్చుకున్నట్లు కనిపిస్తోంది. భౌతిక దాడుల కంటే సైబర్ దాడులు తక్కువ ఖర్చుతో కూడుకున్నవని, అదే సమయంలో ప్రత్యర్థి దేశాల ఆర్థిక, సాంకేతిక వ్యవస్థలను కుప్పకూల్చడానికి ఇవి శక్తివంతమైన ఆయుధాలని ఇరాన్ భావిస్తోంది. ముఖ్యంగా అమెరికా క్లౌడ్ సేవలను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అమెరికన్ టెక్ కంపెనీలకు ఇరాన్ ఒక గట్టి హెచ్చరికను పంపింది.ఇరాన్ కథను వచ్చే వారంలో ముగిస్తాం.. ట్రంప్ సంచలన ప్రకటన.. బెదిరింపులపై ఇరాన్ ఏమందంటే..ఇరాన్ కథను వచ్చే వారంలో ముగిస్తాం.. ట్రంప్ సంచలన ప్రకటన.. బెదిరింపులపై ఇరాన్ ఏమందంటే..మధ్యప్రాచ్యంలో అమెరికాకు బహ్రెయిన్ అత్యంత సన్నిహిత మిత్రదేశం. అమెరికా నౌకాదళానికి చెందిన ఐదవ నౌకాదళం ప్రధాన కార్యాలయం ఇక్కడే ఉంది. అంతేకాకుండా, అబ్రహం ఒప్పందాల తర్వాత ఇజ్రాయెల్‌తో సంబంధాలను మెరుగుపరుచుకున్న గల్ఫ్ దేశాలలో బహ్రెయిన్ ఒకటి. ఈ నేపథ్యంలో, బహ్రెయిన్ యొక్క టెక్ మౌలిక సదుపాయాలను దెబ్బతీయడం ద్వారా అటు అమెరికాను, ఇటు గల్ఫ్ దేశాలను ఇరాన్ హెచ్చరిస్తోంది.ఈ సైబర్ దాడి వార్త బయటకు వచ్చిన వెంటనే అంతర్జాతీయ టెక్ మార్కెట్లలో ఆందోళన మొదలైంది. అమెజాన్ వంటి దిగ్గజ సంస్థల భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇప్పటికే ట్రంప్ ప్రభుత్వం ఇరాన్‌పై సైనిక చర్యను ముమ్మరం చేస్తామని ప్రకటించిన నేపథ్యంలో, ఈ తాజా సైబర్ దాడి అగ్నికి ఆజ్యం పోసినట్లు అయింది. రాబోయే రోజుల్లో అమెరికా తన వ్యూహాన్ని మార్చుకుని ఇరాన్ సైబర్ విభాగాలపై కూడా దాడులు చేసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

# 12 ఏళ్లు దాటితే ఇల్లు అద్దెదారుడికి సొంతం అవుతుందా

## కొత్త రూల్స్ ఏం చెప్తున్నాయి

సాధారణంగా ఇల్లు లేదా షాపును అద్దెకు ఇచ్చే యజమానులకు ఒక చిన్న భయం ఎప్పుడూ ఉంటుంది. అదేమిటంటే.. "అద్దెకు ఉన్నవారు ఎక్కువ కాలం ఉండిపోతే, ఆ ఆస్తిని వాళ్లే సొంతం చేసుకుంటారా?" అని. ముఖ్యంగా పదేళ్లు, ఇరవై ఏళ్లుగా ఒకే అద్దెదారుడు కొనసాగుతుంటే ఈ భయం సహజం. అయితే భారత దేశంలోని రెంట్ రూల్స్ , సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం, అద్దెదారుడు కేవలం ఎక్కువ కాలం ఉన్నంత మాత్రాన ఆస్తిపై యాజమాన్య హక్కులను పొందలేరు.సుప్రీంకోర్టు ఏమని చెప్పిందిగత ఏడాది 'జ్యోతి శర్మ ఌం విష్ణు గోయల్' కేసులో సుప్రీంకోర్టు ఒక చారిత్రాత్మక తీర్పు ఇచ్చింది. చెల్లుబాటు అయ్యే 'రెంట్ అగ్రిమెంట్' ద్వారా ఇంట్లోకి ప్రవేశించిన ఏ అద్దెదారుడైనా, ఆ తర్వాత యజమాని హక్కులను ప్రశ్నించలేరని కోర్టు స్పష్టం చేసింది. 1953 నుంచి ఒక షాపులో అద్దెకు ఉండి, 2000 నుంచి అద్దె చెల్లించడం మానేసినప్పటికీ, వారు ఆస్తిపై హక్కు కోరలేరని.. వెంటనే ఖాళీ చేయాలని కోర్టు ఆదేశించింది. అద్దె చెల్లించడం అనేది అద్దెదారు , యజమాని మధ్య ఉన్న సంబంధాన్ని స్పష్టం చేస్తుంది కాబట్టి, ఆస్తిపై హక్కు పొందే అవకాశం ఉండదు.అడ్వర్స్ పొసెషన్ అంటే ఏమిటిచట్టంలో 12 ఏళ్ల నిబంధన ఒకటి ఉంది. దీనినే 'అడ్వర్స్ పొసెషన్' అంటారు. అంటే, ఎటువంటి అగ్రిమెంట్ లేకుండా, యజమాని అభ్యంతరం చెప్పకుండా, ఒక వ్యక్తి నిరంతరాయంగా 12 ఏళ్ల పాటు ఒక ఆస్తిని తన ఆధీనంలో ఉంచుకుంటే.. కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో వారు హక్కులు కోరవచ్చు. అయితే, అద్దెకు ఉండేవారికి ఇది వర్తించదు. ఎందుకంటే వారు యజమాని అనుమతితో ఇంట్లోకి వస్తారు. కానీ, అగ్రిమెంట్ గడువు ముగిసినా దాన్ని రిన్యూవల్ చేయకుండా, యజమాని అద్దె తీసుకోకుండా 12 ఏళ్లు వదిలేస్తే మాత్రం న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశం ఉంటుంది.యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలుమీ ఆస్తిని రక్షించుకోవడానికి , రెంట్ రూల్స్ ప్రకారం సురక్షితంగా ఉండటానికి న్యాయ నిపుణులు ఈ క్రింది సూచనలు చేస్తున్నారు..రెగ్యులర్ అగ్రిమెంట్: అద్దె ఒప్పందాన్ని నిర్ణీత కాలానికి మాత్రమే చేసుకోవాలి. గడువు ముగియగానే మళ్ళీ రిన్యూవల్ చేయాలి.రిజిస్ట్రేషన్: దీర్ఘకాలం పాటు అద్దెకు ఇస్తున్నట్లయితే, ఆ అగ్రిమెంట్‌ను రిజిస్టర్ చేయడం ఉత్తమం. దీనివల్ల నిబంధనలు క్లియర్‌గా ఉంటాయి.వరుసగా ఉండనివ్వకండి: 12 ఏళ్ల లోపు కనీసం ఒక్కసారైనా అగ్రిమెంట్ రిన్యూవల్ చేసినా, అద్దెదారుడికి అడ్వర్స్ పొసెషన్ కింద హక్కులు రావు.అద్దె రశీదులు: అద్దెను ఆన్‌లైన్ లేదా చెక్ రూపంలో తీసుకోవడం వల్ల, వారు అద్దెదారులే అని నిరూపించడానికి బలమైన సాక్ష్యం లభిస్తుంది.భారత చట్టాలు యజమాని హక్కులకు రక్షణ కల్పిస్తాయి. అద్దెదారు ఎన్ని దశాబ్దాలు ఉన్నా యజమాని పర్మిషన్ తో ఉన్నంత కాలం ఆస్తి యజమానిదే ఉంటుంది. అయితే, గాలికి వదిలేయకుండా పత్రాలన్నీ సరిగ్గా ఉంచుకోవడం యజమాని బాధ్యత. కేవలం ఒక చెల్లుబాటు అయ్యే అగ్రిమెంట్ మిమ్మల్ని కోర్టుల చుట్టూ తిరగకుండా కాపాడుతుంది. కాబట్టి, రెంట్ రూల్స్ పాటిస్తూ మీ ఆస్తిని సురక్షితంగా ఉంచుకోండి.




# ఆ నౌకలనే అడ్డుకుంటున్నాం

## అమెరికా సెంట్ కామ్ ప్రకటన



ఇరాన్ ఓడరేవులపై అమెరికా పూర్తిస్థాయి సైనిక దిగ్బంధనంఆపరేషన్‌లో పాల్గొంటున్న 10,000 మంది సైనికులు, 12కు పైగా యుద్ధనౌకలుతొలి 24 గంటల్లో 6 వాణిజ్య నౌకలను వెనక్కి పంపిన బలగాలుఏ దేశ నౌక అయినా ఇరాన్ పోర్టులకు వస్తే నిలిపివేస్తామని స్పష్టీకరణహర్మూజ్ జలసంధిలో ఇతర దేశాల నౌకల రాకపోకలకు స్వేచ్ఛఅంతర్జాతీయ జలాల్లో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసేలా అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఇరాన్ ఓడరేవులను పూర్తిగా దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించింది. అరేబియా గల్ఫ్, గల్ఫ్ ఆఫ్ ఒమన్‌లోని అన్ని ఇరాన్ పోర్టుల నుంచి ఏ నౌక బయటకు వెళ్లకుండా, లోపలికి రాకుండా కఠినమైన ఆంక్షలు విధించింది. ఈ భారీ సైనిక ఆపరేషన్ కోసం 10,000 మందికి పైగా అమెరికా నావికులు, మెరైన్లు, వైమానిక దళ సిబ్బందిని రంగంలోకి దించింది. ఈ మిషన్ కోసం డజనుకు పైగా యుద్ధనౌకలు, వందకు పైగా యుద్ధ, నిఘా విమానాలను మోహరించింది.దిగ్బంధనం ప్రారంభమైన తొలి 24 గంటల్లోనే దీని ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఇరాన్ ఓడరేవుల నుంచి బయటకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఏ ఒక్క నౌక కూడా ఈ సైనిక వలయాన్ని దాటి ముందుకు వెళ్లలేకపోయింది. ఈ క్రమంలో, అమెరికా బలగాలు జారీ చేసిన ఆదేశాలను అనుసరించి ఆరు వాణిజ్య నౌకలు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకుని తిరిగి ఇరాన్‌లోని గల్ఫ్ ఆఫ్ ఒమన్ పోర్టులోకి ప్రవేశించాయి. ఈ దిగ్బంధనాన్ని ఏ దేశ నౌకపైనా పక్షపాతం లేకుండా అమలు చేస్తున్నామని, ఇరాన్ పోర్టులకు వెళ్లే లేదా అక్కడి నుంచి బయలుదేరే ఏ నౌకనైనా నిలిపివేస్తామని అమెరికా స్పష్టం చేసింది.అయితే, ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే ఇతర నౌకల స్వేచ్ఛకు ఎలాంటి ఆటంకం ఉండదని హామీ ఇచ్చింది. కేవలం ఇరాన్ పోర్టులకు వెళ్లే లేదా వచ్చే నౌకలను మాత్రమే లక్ష్యంగా చేసుకున్నామని, మిగిలిన రవాణా యథావిధిగా కొనసాగుతుందని తెలిపింది.ఈ భారీ ఆపరేషన్‌లో భాగంగా ఒక ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్, యాంఫిబియస్ అసాల్ట్ షిప్, గైడెడ్-మిసైల్ డిస్ట్రాయర్లు, లిట్టోరల్ కంబాట్ షిప్ వంటి అత్యాధునిక యుద్ధనౌకలు పాల్గొంటున్నాయి. వీటితో పాటు ఫైటర్ జెట్లు, డ్రోన్లు, ఇంధనం నింపే విమానాలు, నిఘా విమానాలు నిరంతరం గగనతలం నుంచి పహారా కాస్తున్నాయి. ఈ మేరకు అమెరికా సెంట్రల్ మిలిటరీ కమాండ్ ఓ ప్రకటనలో వెల్లడించింది.



## మండుటెండలో చెప్పుల్లేకుండా షూటింగ్.. ‘తెరచాప’ హిట్ కావాలి

నవీన్ రాజ్ శంకరపు, పూజ సుహాసిని, శ్రీలు ముఖ్యపాత్రలో నటించిన తాజా చిత్రం ‘తెరచాప’. అనన్య క్రియేషన్స్ బ్యానర్ పై కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ చిత్రానికి జోయల్ జార్జ్ దర్శకత్వం వహిస్తున్నాడు. రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, జగదీష్ ప్రతాప్ బండారి, జబర్దస్త్ అశోక్, నాగి కీలకపాత్రలు పోషించారు. ఏప్రిల్ 17న ఈ చిత్రం విడుదల కాబోతుంది. ఈ నేపథ్యంగా తాజాగా ఈ మూవీ ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీ కనకాల మాట్లాడుతూ..ఈ సినిమాలో నాతోపాటు ఎందరో సీనియర్ నటులు నటించారు. అలాగే కొత్త వారు కూడా నటించారు. మండుటెండలో సముద్ర తీరాన ఇసుకలో చెప్పులు లేకుండా నటించడం అనేది ఎంతో కష్టమైన పరిస్థితి. అటువంటి పరిస్థితులలో కూడా నవీన్ రాజ్ చాలా కష్టపడి నటించారు. శారీరకంగానే కాకుండా మానసిక ఒత్తిళ్లు ఎన్ని ఉన్నా కూడా ఆయన వాటిని ఎదిరించి నిలబడ్డారు. అంత కష్టపడి నటించినా ఈ సినిమాను తన తండ్రికి అంకితం చేస్తున్నాను అని నాతో అన్నప్పుడు నేను ఎంతో ఆనందపడ్డాను.ఈ సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను’ అన్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ... “సముద్రతీతంగా అటువంటి పరిస్థితులలో ఒక సినిమా తీయడం అనేది ఎంతో కష్టమైన విషయం. అటువంటి సినిమాను ఈ చిత్రం బృందం అంతా కలిసి ఎంతో పట్టుదలతో పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. అందరూ వీరిని ఆశీర్వదించవలసిందిగా కోరుకుంటున్నాను” అన్నారు. ‘సినిమా కోసం మేము సముద్ర తీరాన ఎన్నో రోజులు ఎంతో కష్టపడి అక్కడ బ్రతికే మత్స్యకారుల జీవితాలను అర్థం చేసుకొని వారిలో ఒకరిగా కలిసిపోయి చిత్రీకరించాం. ఎంతోమంది ఎన్నో కలలు కని సినిమా తీసినట్లే మేము కూడా చేశాం. మా సినిమాను ప్రేక్షకులు అంతా ఆదరించి మంచి విజయం సాధించేందుకు తోడ్పడుతారని కోరుకుంటున్నాను’ అని హీరో నవీన్‌రాజ్ శంకరాపు అన్నారు.

## రాకా.. ఆ నలుగురితో కేక

అల్లు అర్జున్ పాన్ ఇండియా స్టార్ అయ్యాడు. ఇప్పుడు ఆయన?కు తెలుగులోనే కాదు దేశ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు. వారందరిని మెప్పించే కథలపైనే బన్నీ ఫోకస్ పెట్టాడు. అందులో ఒకటి రాకా. అల్లు అర్జున్ – – అట్లీ కాంబోలో రూపుదిద్దుకొంటున్న తొలి సినిమా ఇది. రూ. 900 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. షూటింగ్ మొదలైనప్పటి నుంచే ఈ సినిమాపై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇక బన్నీ బర్త్‌డే సందర్భంగా విడుదలైన ఫస్ట్ లుక్, టైటిల్ రివీల్ ఆ అంచనాలను మరింత పెంచేశాయి. ఇందులో బన్నీ హీరోగా, విలన్‌గా ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. ఇప్పుడు బయటకు వచ్చిన లుక్ విలన్‌ది. హీరో పాత్రకు సంబంధించిన లుక్ చాలా స్టైలీష్‌గా ఉంటుందట. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ చిత్రానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన విషయం బయటకు వచ్చింది. ఈ సినిమాలు మొత్తం నలుగురు హీరోయిన్లు ఉంటారు. ఇప్పటికే ఒక హీరోయిన్‌గా దీపికా పదుకొణె పేరు బయటకు వచ్చింది. మరో ముగ్గురు హీరోయిన్లలో రష్మిక, మృణాల్, జాన్వీ కపూర్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వీరిలో రష్మిక అల్రేడీ బన్నీతో కలిసి పుష్ప, పుష్ప 2 చిత్రాల్లో నటించింది. మృణాల్, జాన్వీలు తొలిసారి బన్నీతో స్ర్కీన్ చేసుకుంటున్నారు. ఇలా ఒకే సినిమాలో నలుగురు హీరోయిన్లతో కలిసి నటించడం బన్నీ కెరీర్‌లోనే తొలిసారి. కథ డిమాండ్ మేరకే నలుగురిని తీసుకున్నారట. అంతేకాదు ఈ నలుగురి పాత్రలు కూడా సినిమాలో కీలకం అట. ఒకవైపు కావాల్సినంత గ్లామర్‌ని చూపిస్తూనే.. మరోవైపు కథలో కీలకంగా వ్యవహరించేలా వీరి పాత్రలను తీర్చిదిద్దినట్లు సమాచారం. ఈ నలుగురూ బన్నీతో ఒకే ఫ్రేమ్ లో కనిపిస్తే మాత్రం ఫ్యాన్స్ పండగ చేసుకోవడం ఖాయం.

పుష్ప సినిమాతో




## అనుకున్న తేదీకే ‘టాక్సిక్’.. పుకార్లను నమ్మవద్దన్న మేకర్స్



కన్నడ స్టార్ నటుడు యశ్ కథానాయకుడిగా గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో రూపొందుతున్న భారీ బడ్జెట్ చిత్రం ‘టాక్సిక్’. ఈ సినిమా విడుదల వాయిదా పడిందంటూ గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ వార్తలపై చిత్ర బృందం తాజాగా స్పందిస్తూ క్లారిటీనిచ్చింది. ఈ సినిమాను అనుకున్న తేదీ ప్రకారమే జూన్ 4 వరల్డ్ వైడ్‌గా విడుదల చేయబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది. తొలుత ఈ చిత్రాన్ని 2025 ఏప్రిల్‌లో విడుదల చేయాలని భావించినప్పటికీ ఇరాన్ – ఆమెరికా వార్ నేపథ్యంలో వాయిదా వేసుకుంది. ప్రస్తుతం యశ్ ఈ సినిమా ప్రమోషన్ల కోసం అమెరికాలోని లాస్ వెగాస్‌లో జరుగుతున్న ప్రతిష్టాత్మక ‘సినీమాకాన్’ వేడుకలో పాల్గొంటున్నారు. దీనిని కేవలం పాన్–ఇండియా స్థాయిలోనే కాకుండా గ్లోబల్ మార్కెట్‌లోనూ భారీగా విడుదల చేసేందుకు టీమ్ ప్లాన్ చేస్తోంది. 1940 నుండి 1970 మధ్య కాలంలో గోవా గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో నయనతార, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషీ వంటి అగ్ర తారలు నటిస్తున్నారు.

## ‘డ్రాగన్’ కోసం ఆలియా?.. ప్రశాంత్ నీల్ సినిమాలో బాలీవుడ్ బ్యూటీ!



జూనియర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో రాబోతున్న సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న విషయం తెలిసిందే. ప్రస్తుతానికి ‘డ్రాగన్’ అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ హీరోయిన్ ఆలియా భట్ ఒక శక్తివంతమైన కీలక పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. గతంలో రాజమౌళి తెరకెక్కించిన ‘===’ చిత్రంలో తారక్, ఆలియా కలిసి నటించి మెప్పించగా, మరోసారి ఈ జంట వెండితెరపై కనిపించబోతుండటం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతోంది. ఈ సినిమాలో ఆలియా భట్ కేవలం గ్లామర్ పాత్రకే పరిమితం కాకుండా, కథను మలుపు తిప్పే ప్రాధాన్యత ఉన్న పాత్రలో కనిపిస్తారని సమాచారం. ఇప్పటికే కన్నడ నటి రుక్మిణి వసంత్ ఈ చిత్రంలో కథానాయికగా ఎంపికైనట్లు ప్రచారం జరుగుతుండగా, ఆలియా కూడా చేరితే సినిమాలో ఇద్దరు హీరోయిన్లు ఉండే అవకాశం ఉంది. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఇప్పటికే ఆలియాను సంప్రదించారని, దానికి ఆమె సానుకూలంగా స్పందించారని టాక్ నడుస్తోంది, అయితే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ ప్రత్యేకంగా ‘కలరిపయట్టు’ వంటి మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్నారు. ప్రశాంత్ నీల్ మార్క్ హై–వోల్టేజ్ యాక్షన్‌కు ఆలియా వంటి టాలెంటెడ్ నటి తోడైతే, ఈ పాన్–ఇండియా చిత్రం బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ‘డెకాయిట్’ మూవీపై రామ్ చరణ్ ప్రశంసల జల్లు.. అడివి శేష్ నటన అద్భుతమంటూ ట్వీట్!




అడివి శేష్, మృణాల్ ఠాకూర్ ప్రధాన పాత్రల్లో నటించిన మోస్ట్ అవేటెడ్ మూవీ ‘డెకాయిట్’ పై మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రశంసల జల్లు కురిపించారు. తాజాగా ఈ సినిమాను వీక్షించిన ఆయన, సోషల్ మీడియా వేదికగా తన రివ్యూను పంచుకుంటూ చిత్ర బృందాన్ని అభినందించారు. హరి పాత్రలో అడివి శేష్ అద్భుతమైన నటనను కనబరిచారని, ఆయన పెర్ఫార్మెన్స్ ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతుందని చరణ్ కొనియాడారు. అలాగే మృణాల్ ఠాకూర్ తన నటనతో పాత్రకు ప్రాణం పోశారని, ఈ సినిమాలో ఆమె నటన ఎంతో లోతుగా ఉందంటూ మెచ్చుకున్నారు. బాలీవుడ్ దిగ్గజ దర్శకుడు అనురాగ్ కశ్యప్‌తో పాటు ఇతర నటీనటులందరూ తమ ప్రదర్శనతో సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ ఈ చిత్రాన్ని అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, రాజీ పడకుండా నిర్మించిన తీరును చరణ్ ప్రత్యేకంగా అభినందించారు. సాంకేతికంగా సినిమా ఎంతో రిచ్‌గా ఉందని, టీమ్ మొత్తం పడ్డ కష్టానికి తగిన ఫలితం దక్కిందని ఆయన తెలిపారు. రామ్ చరణ్ స్వయంగా సినిమాను మెచ్చుకుంటూ పోస్ట్ చేయడంతో ‘డెకాయిట్’ పై ప్రేక్షకుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. వరుస విజయాలతో దూసుకుపోతున్న అడివి శేష్ ఖాతాలో ఈ చిత్రం మరో భారీ విజయంగా నిలుస్తుందని ఇండస్ట్రీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ఈ మెగా ప్రశంసలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.